నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

దంతేవాడలో సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టుల దాడి

దంతేవాడ, జూన్ 23: ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో మావోయిస్టులు మరోసారి విరుచుకుపడ్డారు. జిల్లాలోని దర్భ డివిజన్ మలంగేర్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ (అఖీఖఈ) క్యాంప్‌పై మావోయిస్టులు దాడి చేశారు. దీంతో అప్రమత్తమైన జవాన్లు ఎదురుదాడికి దిగారు. సీఆర్పీఎఫ్ జవాన్లు, మావోయిస్టుల మధ్య గంటపాటు ఎదురుకాల్పులు జరిగాయని ఏఎస్పీ రాజేంద్ర జైస్వాల్ తెలిపారు.

ఈ దాడిలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదని చెప్పారు. మలంగేర్‌లో ఈ మధ్యే సీఆర్పీఎఫ్ క్యాంపును ఏర్పాటు చేశారు. దానిపైనే మావోయిస్టులు దాడిచేయడం గమనార్హం. ఈ నెల 21న ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులోని నువాపాడా వద్ద సీఆర్పీఎఫ్ జవాన్లపై మావోయిస్టులు దాడి చేసిన విషయం తెలిసిందే. నక్సల్స్ కాల్పుల్లో ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు.

హైదరాబాద్ | శుక్రవారం 24-6-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 261 | పేజీలు:6 | వెల: రూ.1/-

సింగరేణిలో ఉద్యోగ నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 23:చాలా రోజుల తరువాత సింగరేణిలో ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్ వచ్చింది. సింగరేణిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సింగరేణి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తులు వచ్చేనెల 10 వరకు అందుబాటులో ఉంటాయి. ఈ పోస్టులకు డిగ్రీ లేదా డిప్లొమా చేసినవారు అర్హులు. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 177 పోస్టులను భర్తీ చేస్తున్నది. ఈ ఉద్యోగాలను ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన అభ్యర్థులతో భర్తీ చేస్తారు.

ఖాళీగా మొత్తం 177 పోస్టులు ఉన్నాయి. దీనికి అర్హులు కావాలంటే డిగ్రీలో కంప్యూటర్స్‌లో లేదా డిప్లొమా చేసి ఉండాలి. అభ్యర్థులు 30 ఏండ్లలోపు వారై ఉండాలి. రాత పరీక్ష ద్వారా వీరికి ఎంపిక చేయనున్నారు. దరఖాస్తు ప్రక్రియ మొత్తం ఆన్ లోనే జరుగుతుంది. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేవారికి చివరి తేదీ జూన్ 10 గా అధికారులు నిర్ధారించారు. దీనికి సంబంధించిన వెబ్ సైట్ https://scclmines.com/ ఓపెన్ చేసిన దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు.

విజయవంతంగా రోదసీలోకి దూసుకెళ్లిన జీశాట్-24

న్యూఢిల్లీ, జూన్ 23: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జీశాట్–24 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్షలో ప్రవేశపెట్టింది. ఈ ఉపగ్రహాన్ని ఫ్రెంచ్ కంపెనీ ఏరియన్ స్పేస్ గురువారం ఫ్రెంచ్ గయానా (దక్షిణ అమెరికా)లోని కౌరూ అంతరిక్ష కేంద్రం నుంచి ఏరియన్?5 రాకెట్‌తో ఇస్రో రోదసీలోకి పంపింది. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), కేంద్ర ప్రభుత్వం తరపున డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్(డీఓఎస్) సంయుక్తంగా 4,180 కిలోల బరువు కలిగిన జీశాట్?24 ఉపగ్రహాన్ని కక్షలో ప్రవేశపెట్టాయి.

ఈ ఉపగ్రహంలో 24 కేయూ బ్యాండ్ ట్రాన్స్‌పాండర్లు అమర్చి డీటీహెచ్ అప్లికేషన్ అవసరాలను తీర్చేందుకు పాన్ ఇండియా కవరేజీతో రోదసీలో పంపారు. జీశాట్?25తో డీటీహెచ్ అప్లికేషన్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. అంతరిక్ష రంగ సంస్కరణల తర్వాత న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) ప్రారంభించిన డిమాండ్ ఆధారిత కమ్యూనికేషన్ శాటిలైట్ మిషన్ ఇదేకావడం విశేషం. ఇదిలా ఉండగా.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్(షార్)లో రెండో లాంచ్‌ప్యాడ్ నుంచి ఈ నెల 30న సాయంత్రం 6 గంటలకు పీఎస్ఎల్వీ సీ53 ప్రయోగాన్ని నిర్వహించేందుకు ఇస్రో ఏర్పాట్లు చేస్తున్నది

ముంబైకి రండి, మీ ధైర్యాన్ని చూపించండి- రెబల్ ఎమ్మెల్యేలనుద్దేశించి సంజయ్ రౌత్

ముంబై, జూన్ 23:మహారాష్ట్రలో రాజకీయ ప్రతిష్ఠంభన కొనసాగుతున్నదది. శివసేన మంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో ఆ పార్టీకి చెందిన 40 మందికిపైగా ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి అస్సాం రాజధాని గౌహతిలో మకాం వేశారు. దీంతో శివసేన చీలికదశకు చేరగా, ఆ పార్టీ చీఫ్, సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ప్రభుత్వం పడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే శివసేన ఎంపీ, ఆ పార్టీ అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ మాత్రం చాలా గంభీరంగా ప్రకటనలు ఇస్తున్నారు. ముంబైకి తిరిగి వచ్చి ధైర్యాన్ని ప్రదర్శించాలని తిరుగుబాటు ఎమ్మెల్యేలనుద్దేశించి అన్నారు. రెబల్ ఎమ్మెల్యేలు గౌహతిలో ఉండి మాట్లాడటం సరికాదన్నారు. వారు ముంబైకి తిరిగి వచ్చి సీఎంతో చర్చించాలని సూచించారు.

ఎమ్మెల్యేలందరి అభీష్టం అదే అయితే ఎంవీఏ కూటమి నుంచి వైదొలగేందుకు సిద్ధంగా ఉన్నామని సంజయ్ రౌత్ తెలిపారు. అయితే దాని కోసం రెబల్ ఎమ్మెల్యేలు ముంబైకి తిరిగి వచ్చి సీఎంతో చర్చించాలని కోరారు. ఏక్‌నాథ్ షిండేతో ఉన్న ఎమ్మెల్యేల్లో 22 మంది తమతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. ముంబైకి తిరిగి వస్తే వారు ఎలాంటి ఒత్తిడిలో తమను వీడాల్సి వచ్చిందో అన్నది చెబుతారని అన్నారు. ఈ విషయం కూడా త్వరలో బయటపడుతుందన్నారు.

ఉద్ధవ్ ఠాక్రే సీఎం పదవిని లేదా శివసేన అధ్యక్ష పదవిని కోల్పోయే ప్రమాదం ఏమీ లేదని సంజయ్ రౌత్ అన్నారు. ఒకవేళ అసెంబ్లీలో బలపరీక్ష ఎదురైతే మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ప్రభుత్వం గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, రాజీనామాకు సిద్ధమన్న ఉద్ధవ్ ఠాక్రే, బుధవారం రాత్రి సీఎం అధికార నివాసాన్ని ఖాళీ చేసిన అనంతరం భారీగా తరలివచ్చిన శివ సైనికులతో కలిసి సొంత నివాసం మాతోశ్రీకి చేరుతున్నారు. దీంతో గత రాత్రి ఒక సింహాన్ని మీరు రోడ్డుపై చూశారంటూ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు.

చరిత్రలో నేటినిజం

కం॥ ఆనయుడు ధన తతి ప్రియుడు
సినిమా రంగమునకిడిన సేవలవలనన్
జనుల మనంబున నిలుచుచు
ప్రణుతులగాంచె "గూడవల్లి రామబ్రహ్మం" !!

(జూన్ 24 తొలితరం నిర్మాత గూడవల్లి రామబ్రహ్మం జయంతి..)



–రాధశ్రీ

సెల్: 9494481210

ఉజ్జయిని మహంకాళి బోనాలకు పటిష్ట భద్రత : మంత్రి తలసాని

హైదరాబాద్, జూన్ 23: జులై 17 వ తేదీన జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా బాటా నుంచి రాంగోపాల్ పేట ఓల్డ్ పోలీసు స్టేషన్ వరకు చేపట్టిన వీడీసీసీ రోడ్డు నిర్మాణం, ఆలయ పరిసరాలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. రోడ్డు పనులను త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఉత్సవాల నాటికి అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన మహంకాళి బోనాల సందర్భంగా అమ్మ వారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున వస్తారని, ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల తోపులాట లేకుండా పటిష్టమైన భారీకేడ్‌లను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. అమ్మవారికి బోనాలు తీసుకొచ్చే వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేయాలని పోలీసు, దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు.

భక్తులకు వాటర్ పాకెట్స్, బాటిల్స్ అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీ ముకుంద రెడ్డి, ఈఈ సుదర్శన్,ఆర్ అండ్ బీ రవీంద్ర సాగర్, ఆలయ ఈవో మనోహర్ రెడ్డి, ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ గంగారెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం మణా రెడ్డి, సీఐ కావేటి శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ , ఆలయ ట్రస్టీ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా మైదానాలను నిర్మిస్తున్నాం : మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, జూన్ 23:తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ క్రీడల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని క్రీడా, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

గురువారం హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 36 వ ఎడిషన్ ఒలింపిక్ డే రన్ – 2022 లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్రీడాభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో క్రీడా మైదానాలను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే సగానికిపైగా క్రీడా మైదానాలను పూర్తి చేసి ప్రారంభించామన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మహబూబ్ నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను 100 శాతం పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు.

అదే స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా ప్రాంగణాల్లో కబడ్డీ కోర్టు, వాలీబాల్ కోర్టు, బ్యాడ్మింటన్ కోర్ట్, క్రికెట్ కిట్లను అందించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడలను అభివృద్ధి చేసేందుకు దేశంలో ఎక్కడాలేని విధంగా అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా, మండల, గ్రామీణ స్థాయిలో సమన్వయం చేసుకుంటూ క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు. వచ్చే ఒలింపిక్ డే రన్ ను సుమారు 50 వేల మందితో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.వేణుగోపాల చారి, రాష్ట్ర క్రీడా శాఖ కార్యదర్శిసందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర రాయి చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, విద్యా మౌలిక సదుపాయాల కల్పన శాఖ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, బేవరేజెస్ కార్పొ రేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, ఉపాధ్యక్షుడు ప్రేమ్ రాజ్ తదితరులు ఉన్నారు.

రైల్వేకు రూ.1000కోట్ల నష్టం.. దశాబ్దంలో ఇదే అత్యధికం..!

న్యూఢిల్లీ, జూన్ 23:కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చాలా ప్రాంతంలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. నిరసనకారులు పెద్ద ఎత్తున రైల్వే ఆస్తులను ధ్వంసం చేశారు. గత కొద్ది రోజులుగా రైళ్లను రద్దు చేసినందుకు ప్రయాణికులకు రీయింబర్స్‌మెంట్‌తో సహా భారతీయ రైల్వే ఇప్పటి వరకు రూ.1000కోట్లకుపైగా నష్టాన్ని చవిచూసింది. ఆందోళనకారులు రైల్వే ఆస్తులను సైతం ధ్వంసం చేయడంతో పాటు డజనుకుపైగా రైళ్లను తగులబెట్టారు. జూన్ 18 వరకు నాలుగు రోజుల్లోనే నిరసనలతో రూ.700కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని రైల్వే పేర్కొంది. 60కోట్లకుపైగా ప్రయాణికుల టికెట్లు రద్దయ్యాయి. రైల్వేకు గత కొద్ది రోజుల్లోనే జరిగిన ఆస్తి నష్టం దశాబ్దకాలంలో జరుగలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఒక జనరల్ కోచ్ నిర్మాణానికి రూ.80 లక్షలు, స్లీపర్ కోచ్, ఏసీ కోచ్‌కు యూనిట్‌కు వరుసగా రూ.1.25 కోట్లు, రూ.3.5 కోట్లు ఖర్చవుతుంది. రైలు ఇంజిన్ తయారీకి రూ.20కోట్లకుపైగానే వెచ్చించాల్సి ఉంటుంది. 12 కోచ్‌ల ప్యాసింజర్ రైలు ధర రూ.40 కోట్లు, 24 కోచ్‌ల రైలు ధర రూ.70 కోట్లకుపైనే ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. దేశంలో నిరసనలైనా, ఉద్యమాలైనా తరుచూ రైల్వే ఆస్తులే విధ్వంసానికి గురవుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో ఆర్ఆర్‌బీ–ఎన్‌టీపీసీ పరీక్షల అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. రైల్వే మంత్రిత్వశాఖ డేటా ప్రకారం.. 2020–21లో నిరసనల కారణంగా రైల్వే రూ.456.20కోట్లకుపైగా నష్టాన్ని చవిచూసింది. 2019–20లో రూ.100 కోట్లకుపైగా నష్టాన్ని చవిచూసింది.

5 సంవత్సరాల వరకు జైలు శిక్ష

రైల్వే ఆస్తులకు నష్టం కలిగించడం చట్టరీత్యా నేరం. నేరం రుజువైతే ఐదు సంవత్సరాల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉంటుంది. రైల్వే చట్టం ప్రకారం.. ఎవరైనా ఏదైనా రైల్వే ఆస్తికి నిప్పంటించడం, ఏదైనా పద్ధతిలో ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగిస్తే అతను ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో జరిమానాతో పాటు శిక్షణ పడే అవకాశాలూ లేకపోలేదు. రైల్వే ట్రాక్‌లు, వంతెనలు, స్టేషన్ భవనాలు, క్యారేజీలు, లోకోమోటివ్‌లు, సిగ్నల్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ ట్రాక్షన్, టెలికమ్యూనికేషన్ సిస్టమ్ రైల్వే ఆస్తులు.

కేంద్రమంత్రి హరిదీప్ సింగ్‌తో మంత్రి కేటీఆర్ భేటీ

న్యూఢిల్లీ, జూన్ 23: ఢిల్లీలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరీతో రాష్ట్ర ఐటి, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కేటీఆర్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్లాన్‌కు ఆర్థిక సాయం చేయాలని కేంద్రమంత్రిని కేటీఆర్ కోరారు. ఎస్‌టీపీల నిర్మాణాలకు రూ. 8,654.54 కోట్లు ఖర్చు అవుతుందని కేటీఆర్ తెలిపారు. ప్రాజెక్టు వ్యయంలో మూడో వంతు అమృత్-2 కింద రూ. 2,850 కోట్లు ఇవ్వాలని వినతి చేశారు. హైదరాబాద్‌లో వ్యక్తిగత రాపిడ్ ట్రాన్సిట్ కారిడార్‌కు సహకరించాలని కేంద్రమంత్రిని కేటీఆర్ కోరారు.

ఈ నెల 28 న రైతుల ఖాతాల్లోకి రైతుబంధు నగదు

హైదరాబాద్, జూన్ 23:తెలంగాణ రైతులకు గుడ్ న్యూస్ తెలిపింది సర్కార్. గత కొద్దీ రోజులుగా రైతు బంధు నిధుల కోసం యావత్ రైతులు ఎదురుచూస్తున్నారు. మరోపక్క విపక్షాలు సైతం నిధులు ఇంకా వేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ సర్కార్ రైతుల నిధులు జమ చేస్తున్నట్లు అధికారిక ప్రకటన చేసారు. ఈ నెల 28 నుంచి వానాకాలం పంట పెట్టుబడి రైతు బంధు నిధులను విడుదల చేయాలని సీఎం కేసీఆర్ అధికార యంత్రాంగానికి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో అదే రోజు నుంచి రైతుల ఖాతాల్లో రైతు బంధు నిధులను జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ తెలిపారు. ఎప్పటిలాగే రైతుల భూ విస్తీర్ణం ప్రకారం (ఎకరాల వారీగా) వరుస క్రమంలో వారి ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయనున్నారు. అంతకుముందు వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి.. మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని చెప్పారు. రైతులందరి ఖాతాల్లో త్వరలోనే రైతుబంధు పెట్టుబడి సాయం జమ చేస్తామని చెప్పారు. ఇప్పటికే దీనికి సంబ ంధించి ఆర్థిక, వ్యవసాయ శాఖలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన చెప్పారు.

వ్యవసాయం కోసం పెట్టుబడిని ఋణంగా నగదు రూపంలో రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే రైతుబంధు పథకం ఈ పథకాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు 2018, మే 10న కరీంనగర్ జిల్లా, హుజూరాబాద్ నియోజకవర్గంలోని శాలపల్లి ? ఇందిరానగర్ వద్ద ప్రారంభించాడు. మొట్టమొదటి సారిగా ధర్మరాజుపల్లి వాసులు తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా చెక్కులు, పట్టాదార్ పాసు పుస్తకాలు అందుకున్నారు. రైతుబంధు పథకం కింద ప్రభుత్వం ఎకరానికి రూ.5 వేల చొప్పున సాగుకు పెట్టుబడి సాయం చేయనుంది. ఖరీఫ్, రబీ సీజన్ లకు ఎకరానికి రూ. 5000 చొప్పున రెండు సీజన్లకు కలిపి రూ. 10000 పెట్టుబడిగా ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో వేయనుంది.

చెట్టును ఢీకొట్టిన యాత్రికుల వ్యాన్.. 10 మంది మృతి

లక్నో, జూన్ 23:: ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. యాత్రికులతో వెళ్తున్న మినీ వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో 10 మంది యాత్రికులు మరణించారు. ఈ ప్రమాదంలో మరో ఏడుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మొత్తం 18 మంది హరిద్వార్‌లో స్నానం చేసి తిరిగివెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

ప్రమాద ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌గ్ర్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కారం..

మంచిర్యాల జూన్ 23:ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నాయకుడి వద్దకు వెళుతుంటారు ఇది మామూలే.. కానీ జనం వద్దకే నాయకుడు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించడమే విశేషం.. మంచిర్యాల జిల్లా చెన్నూరు శాసన సభ్యులు బాల్క సుమన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సుమన్ అన్న జనం బాట పేరిట ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో పర్యటించారు. ప్రజల ఇళ్లకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాలు చెన్నూరు శాసన సభ్యులు బాల్కసుమన్ మాట్లాడుతూ.. తనను నమ్మి గెలిపించిన ప్రజల వద్దకే వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకోవడంతో పాటు పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. తమ ఇంటికి ఎమ్మెల్యే వచ్చి సమస్యలు అడిగి పరిష్కరించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం 10 గంటలకు దామోదర్ రావు పార్థసారథిరెడ్డి ఎంపీలుగా ప్రమాణం

హైదరాబాద్, జూన్ 23:రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన నమస్తే తెలంగాణ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ దీవకొండ దామోదర్‌రావు, హెటిరో ఫార్మా వ్యవస్థాపకుడు బండి పార్థసారథిరెడ్డి ఈ నెల 24న తమ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన కార్యాలయంలో నూతన ఎంపీలచేత శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

దీవకొండ దామోదర్ రావు జీవిత నేపథ్యం..

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూరుకు చెందిన దీవకొండ దామోదర్ రావు తెలంగాణ ఉద్యమం ప్రస్థానంలో తొలినాళ్ల నుంచి నేటి ముఖ్యమంత్రి.. నాటి ఉద్యమ నాయకుడు కేసీఆర్ వెంట నడిచిన వ్యక్తుల్లో ఒకరు. 2001 నుంచి టీఆర్ఎస్ పార్టీలో పలు హోదాల్లో పని చేశారు. పొలిట్ బ్యూరో సభ్యుడిగా, ప్రధాన కార్యదర్శిగా, పార్టీ సెక్రటరీ – ఫైనాన్స్‌గా వ్యవహరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర మలిదశ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన టీ న్యూస్, నమస్తే తెలంగాణ పత్రికల స్థాపనలో ఆయనది ప్రధాన భూమిక. తెలంగాణకు సొంత మీడియా సంస్థలు ఉండాలని నాటి ఉద్యమ నేత కేసీఆర్‌కు వచ్చిన ఆలోచనలకు అనుగుణంగా రెండు మీడియా సంస్థలను నెలకొల్పడంలో దామోదర్ రావు తన సహకారం అందించారు. తెలంగాణ బ్రాడ్ కాస్టింగ్(టీ న్యూస్ చానెల్)కు తొలి మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన దామోదర్ రావు.. ప్రస్తుతం డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున కొనసాగుతున్న సమయంలోనే తెలంగాణ పబ్లికేషన్స్‌ను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ తలచిన వెంటనే దాని ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. తెలంగాణ పబ్లికేషన్స్(నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికలు) కు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. 1958 ఏప్రిల్ 1న జన్మించిన దామోదర్ రావుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

పార్థసారథిరెడ్డి.. ఫార్మసీ టు పార్లమెంట్..

ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన బండి పార్థసారథిరెడ్డి హెటిరో డ్రగ్స్ వ్యవస్థాపకుడు. వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో జన్మించిన పార్థసారథిరెడ్డి కందుకూరులో డిగ్రీ పూర్తి చేసి ఓ ప్రయివేటు కంపెనీలో పని చేస్తూనే హెటిరో సంస్థను స్థాపించారు. తన సంస్థ ద్వారా దాదాపు పది వేల మందికి పైగా ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారు. స్వగ్రామమైన కందుకూరులో కల్యాణమండపం, సాయిబాబా దేవాలయాన్ని నిర్మించారు. పలు విద్యాసంస్థలు స్థాపించి విద్యావేత్తగా సేవలందిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని పలు గ్రామాల్లో జరిగే అనేక కార్యక్రమాలకు గుప్తదానాలు చేస్తారని పార్థసారథిరెడ్డికి పేరు ప్రతిష్టలున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనే పార్థసారథిరెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు.

ప్రాణికోటి మనుగడకే 'మట్టి పరిరక్షణ ఉద్యమం'

ప్రపంచ మానవాళికి 95 శాతం ఆహారాన్ని మట్టి అందిస్తున్నది. విశ్వ జనులు ఐక్యతతో చేయి చేయి కలిపితే మట్టి ఆరోగ్యం పరిరక్షించబడుతుందని, అద్భుత మహిమగల ధరిత్రి మట్టి మర్యాదను మంటగలిపితే మానవ మనుగడతో పాటు సకల ప్రాణుల ఉనికి ప్రమాదంలో పడుతుందని 'ఇషా ఫౌండేషన్' వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆవేదన వ్యక్తం చేయడం సముచితంగా, ఆలోచనాత్మకంగా, ఆహ్వానించదగినదిగా ఉంది. జగ్గా వాసుదేవ్ స్థాపించిన 'ఇషా ఫౌండేషన్' నేతృత్వంలో మట్టి సహజత్వాన్ని కోల్పోతున్న వేళ 'సేవ్ సాయిల్ మూవ్‌మెంట్ (మట్టి ఆరోగ్య పరిరక్షణ ఉద్యమం)' మార్చి 2022లో ప్రారంభించి తానే స్వయంగా నాయకత్వం వహిస్తూన్న 64-ఏళ్ళ సద్గురువు 100-రోజుల మోటార్లు బైక్స్ యాత్ర 27 దేశాలగుండా సాగుతూ జూన్ నెలాఖరున ముగియనుంది. నిర్జీవ పదార్థమైన మట్టి మాత్రమే మరో ప్రాణికి జీవం పోయగల మహత్తర శక్తిని కలిగి ఉందని ప్రచారం చేస్తూ, మన్ను మర్యాదను కాపాడేందుకు అందరూ ఉద్యమించాలని అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. మట్టి సహజత్వాన్ని కాపాడుకుంటేనే మానవాళి ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలుసుకోవాలి. జీవుల ఉనికితో మట్టికి విడదీయరాని సంబంధం ఉందని, ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 52 శాతం సారవంతమైన భూములు నిస్సారం అయ్యాయని, ఇలాగే మన్ను మర్యాదను మంటగలిపితే జీవకోటి ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని గమనించాలి.

విచ్చలవిడి పెస్టిసైడ్స్, రసాయనాలు, ఎరువులు వాడడంతో వ్యవసాయ భూములు ఎడారులుగా మారతాయని వివరిస్తున్నారు. మట్టి ఆరోగ్యం క్షీణిస్తే రాబోయే రోజుల్లో 8 బిలియన్ల ప్రపంచ ప్రజలకు పోషకాహారం అందడం అసాధ్యమని తెలుస్తున్నది. నేలలో కర్బన పదార్థాల పరిమాణం 12 - 15 శాతానికి పెంచగలిగితే ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండానే మంచి వ్యవసాయ దిగుబడులు పొందవచ్చని తెలుసుకోవాలి. నేల మన్ను సారం అంతరించే ప్రమాదపు అంచున మానవాళి ఉందని గమనించాలి. మట్టిలో కర్బన పదార్థాల శాతం కనీసం 3-6 వరకు ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు కార్బన్ శాతం పెంచేలా ప్రభుత్వాలు రాయితీలు ప్రకటించాలి. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అడవుల నరికివేత, జీవం పోయగల నేల 6-ఇంచుల పై పొర కొట్టుకు పోవడం లాంటి భయంకర పరిస్థితులు నెలకొన్నాయి. వాతావరణ ప్రతికూల మార్పులు, కార్బన్ ఉద్గారాలు, గాలి కాలుష్యం, నీటి ఎద్దడి లాంటి సమస్యకు ఇస్తున్న ప్రాధాన్యతతో పోల్చితే మట్టి పరిరక్షణకు ఇవ్వకపోవడం విచారకరం. పంట మార్పిడి, పంట సహజీవన (క్రాఫ్ సింబయాసిస్) అలవాట్లు మాయం కావడం, విచక్షణారహిత సాగు పద్దతులతో నేల మన్ను నాణ్యత తగ్గుతోంది. మట్టి సత్తువను పీల్చితే ఆకలి కేకలు, కరువుకాటకాలు రాజ్యమేలుతాయి. మ్యాంగ్రూ ఫారెస్ట్స్ (మడ అడవులు) తగ్గితే సముద్ర చేపలు, మె?క్కలు అంతరించడం తప్పదని తెలుసు కోవాలి.

భారతదేశ మట్టిలో కర్బన పదార్థ పరిమాణం (సాయిల్ ఆర్గానిక్ కార్బన్, యస్ఓసి) ప్రమాదకర స్థాయికి పడిపోయిందని శాస్త్రజ్ఞులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 70 ఏళ్లలో భారత దేశ మట్టిలో కర్బన పదార్థ పరిమాణం 1 శాతం నుంచి 0.3 శాతానికి పడిపోవడంతో నేల నీటి నిల్వ సామర్థ్యం, మట్టి నిర్మాణం, సారం ప్రభావితం కావడం జరుగుతోంది. మట్టిలో కర్బన పరిమాణం క్షీణిస్తే పంట దిగుబడి తగ్గడం, మట్టి ఆరోగ్యానికి కారణమైన సూక్ష్మజీవులు చనిపోవడంతో నేలలు ఎడారులను తలపిస్తాయి. యస్ఓసి పరిమాణాన్ని పెంచే కంపోస్ట్, పచ్చి రొట్ట, బయోఫెర్టిలైజర్స్ లాంటి సహజ ఎరువులను వాడకుండా విచక్షణారహితంగా రసాయన ఎరువులు, పెస్టిసైడ్స్ వాడడంతో మన్ను సత్తువ తగ్గుతోంది. కార్బన పరిమాణం మట్టిలో పెరిగితే పంటలకు నీటి అవసరం 30-40 శాతం తగ్గుతుందనే శుభ వాస్తవాన్ని మరువరాదు. 'చేతన గ్రహం - మట్టి పరిరక్షణ ఉద్యమం'లో మనందరం పాల్గొని మన భరతమాత పాదాల కింది వ్యవసాయ మట్టిలో కనీస కర్బన పరిమాణం 3-4 శాతానికి పెంచడానికి తీవ్ర ప్రయత్నాలు చేయాలి.

మట్టి విధ్వంసం ఇలాగే కొనసాగితే వాతావరణ మార్పులు, కరువుకాటకాలు, జీవవైవిధ్య విధ్వంసం, సాగు దిగుబడులు పడిపోవడం లాంటి తీవ్ర పరిణామాల్ని మానవాళి ఎదుర్కోవలసి ఉంటుంది. పారిశ్రామిక విప్లవం సాగు పద్దతులు, మాంసం వాడకం పెరగడం, పశుగ్రాస అతి వాడకం పెరగడం లాంటి కారణాలు కూడా మట్టి నాణ్యత పడిపోవడానికి కారణం అవుతున్నాయి. మట్టి మర్యాదను మంటగలిపితే ప్రజారోగ్యం, విపత్తులు, కరువులు, ఆహార కొరత, ఆకలి చావులు లాంటి దుష్ప్రభావాలు కలుగుతాయని తెలుసు కోవాలి. ఇలాంటి అతి గంభీరమైన సమస్యను గుర్తించి సద్గురువు జగ్గీ వాసుదేవ్ బృందం చేపట్టిన మట్టి ఆరోగ్య పరిరక్షణ ఉద్యమానికి మానవాళి చేయూతను ఇవ్వాలి. భవిష్యత్తు తరాలతో పాటు సకల జీవజాతుల ఆరోగ్యం కాపాడటానికి మానవ హారం పడదాం, మట్టి మర్యాదను కాపాడుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మరియు ఆస్ట్రేలియన్ రక్షణ మంత్రి మిస్టర్ రిచర్డ్ మార్లెస్ రక్షణ సహకారాన్ని పెంపొందించే మార్గాలపై చర్చ

న్యూఢిల్లీ, జూన్ 23:రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మరియు ఆస్ట్రేలియా ఉప ప్రధాన మంత్రి మరియు రక్షణ మంత్రి శ్రీ రిచర్డ్ మార్లెస్ జూన్ 22, 2022న న్యూ ఢిల్లీలో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. కోవిడ్-19 మహమ్మారి సవాళు ఉన్నప్పటికీ పెరుగుతున్న ప్రస్తుత రక్షణ సహకార కార్యకలాపాలను ఇద్దరు మంత్రులు సమీక్షించారు. మరియు మరింత సహకారాన్ని పెంపొందించే మార్గాల గురించి చర్చించారు.

భారత్-ఆస్ట్రేలియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన రక్షణ, భద్రతా అంశాలను మంత్రులు సమీక్షించారు. పరస్పర విశ్వాసం మరియు అవగాహన, ఉమ్మడి ఆసక్తులు మరియు భాగస్వామ్య విలువలు, ప్రజాస్వామ్యం మరియు చట్ట నియమాల ఆధారంగా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అమలు చేయడం పట్ల వారు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. రెండు దేశాల మధ్య పెరుగుతున్న వైవిధ్యం మరియు రక్షణ వ్యాయామాలు మరియు మార్పిడిని వారు స్వాగతించారు మరియు భారతదేశం-ఆస్ట్రేలియా మ్యూచువల్ లాజిస్టిక్స్ సపోర్ట్ అరేంజ్‌మెంట్ ద్వారా కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించారు.

ఈ ఏడాది చివర్లో ఆస్ట్రేలియాలో సమావేశం కానున్న డిఫెన్స్ రీసెర్చ్ అండ్ మెటీరియల్ కోఆపరేషన్‌పై భారత్-ఆస్ట్రేలియా జాయింట్ వర్కింగ్ గ్రూప్ (జెడబ్ల్యుజి)కి పూచీకత్తు ఇచ్చేందుకు మంత్రులిద్దరూ కట్టుబడి ఉన్నారు. ఈ జెడబ్ల్యుజి రక్షణ పరిశ్రమల మధ్య సంబంధాలను పెంచడానికి కీలకమైన యంత్రాంగం. సరఫరా గొలుసుల స్థితిస్థాపకతను పెంచడానికి మరియు సంబంధిత రక్షణ దళాలకు సామర్థ్యాలను అందించడానికి భారతదేశం మరియు ఆస్ట్రేలియా మధ్య పారిశ్రామిక సహకారానికి మరిన్ని అవకాశాలపై మంత్రులు చర్చించారు. భారతదేశం మరియు ఆస్ట్రేలియా రక్షణ పారిశ్రామిక స్థావరాల మధ్య సంబంధాలు మరియు అవకాశాలను పెంపొందించడానికి మార్గాలను అన్వేషించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి.

మార్చి 21, 2022న ఇరు దేశాల ప్రధాన మంత్రుల మధ్య జరిగిన వర్చువల్ సమ్మిట్ సమావేశంలో ప్రకటించిన ల్యాండ్‌మార్క్ జనరల్ రావత్ యంగ్ ఆఫీసర్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌ను 2022 చివరి భాగంలో ప్రారంభించాలనే ప్రణాళికను ఇద్దరు మంత్రులు స్వాగతించారు.

మంత్రులు వ్యూహాత్మక సవాళ్లు మరియు ప్రాంతీయ భద్రతా పరిస్థితిని సమీక్షించారు మరియు బహిరంగ, ఉచిత, సంపన్నమైన మరియు నియమాల ఆధారిత ఇండో పసిఫిక్ ప్రాంతం యొక్క వారి భాగస్వామ్య లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. అక్టోబర్ 2022లో ఆస్ట్రేలియా ఇండో పసిఫిక్ ఎండీవర్ ఎక్సర్‌సైజ్‌లో భారతదేశం పాల్గొనడంపై ఆసక్తి ప్రదర్శించారు.

అంతకుముందు ఆస్ట్రేలియా ఉప ప్రధాని మరియు రక్షణ మంత్రి జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి, స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి యుద్ధ వీరులకు నివాళులర్పించారు. శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌తో ద్వైపాక్షిక సమావేశానికి ముందు ఆస్ట్రేలియా ఉప ప్రధానమంత్రి మరియు రక్షణ మంత్రికి గౌరవ వందనం అందించారు.

మిస్టర్ రిచర్డ్ మార్లెస్ జూన్ 20-23, 2022 నుండి భారతదేశ పర్యటనలో ఉన్నారు. జూన్ 21, 2022న, అతను గోవాను సందర్శించారు. ఇందులో గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ పర్యటన మరియు స్వదేశీ డ్రోన్ అభివృద్ధి మరియు స్వయంప్రతిపత్త వాహన సాంకేతికతలో భారతదేశం యొక్క పెరుగుతున్న నైపుణ్యం యొక్క ప్రదర్శన ఉన్నాయి.

అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పలేదని కాలేజ్ ప్రిన్సిపాల్‌ని కొట్టిన ఎమ్మెల్యే

న్యూఢిల్లీ, జూన్ 23:కాలేజ్ ప్రిన్సిపాల్ ని కొట్టి విమర్శలు ఎదుర్కొంటున్నారు ఓ ఎమ్మెల్యే. తాను అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వలేదని కర్ణాటక మాండ్య నియోజకవర్గ ఎమ్మెల్యే..జేడీఎస్ పార్టీకి చెందిన ఎం.శ్రీనివాస్ మాండ్యలోని నల్వాడి కృష్ణ రాజా వడయార్ ఐటీఐ కళాశాలను ఈనెల 20న సందర్శించారు. నైపుణ్య అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన అక్కడ కంప్యూటర్ ల్యాబ్‌కు సంబంధించి జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ క్రమంలో తన ప్రశ్నలకు ప్రిన్సిపాల్ నాగనాథ్ సరైన సమాధానాలు ఇవ్వడం లేదని ఎమ్మెల్యే కోపం తెచ్చుకున్నారు. అంతే.. కళాశాల సిబ్బంది, ప్రజల ముందే సదరు ప్రిన్సిపాల్‌ను చెంప దెబ్బలు కొట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎమ్మెల్యే తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కర్ణాటకలోని ఉద్యోగ సంఘాలు ఎమ్మెల్యేపైన ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠాలు చెప్పే గురువుపై కళాశాలలోనే దాడి చేసిన ఎమ్మెల్యేపై ప్రజలు, నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న శ్రీ విద్యాప్రసన్న తీర్థరు స్వామీజీ

తిరుపతి, జూన్ 23 తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు దక్షిణ కర్ణాటకలోని కుక్కి సుబ్రమణ్యంలో ఉన్న శ్రీసుబ్రమణ్య మాతా పీఠాధిపతి శ్రీ విద్యాప్రసన్న తీర్థరు స్వామీజీ . గురువారం తిరుమలకు చేరుకున్న శ్రీవిద్యాప్రసన్న తీర్థరు స్వామీజీని ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గర్భాలయంలోకి తీసుకెళ్లారు. ఆయన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం టీటీడీ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్ ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీజీఓ బాలిరెడ్డి, బొక్కసం క్లర్క్ గురురాజారావు, పర్పతేయాదార్ తులసి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీవిద్యాప్రసన్న తీర్థరు స్వామీజీ మాట్లాడుతూ.. స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని చెప్పారు. స్వామివారి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుకున్నట్లు స్వామీజీ చెప్పారు.

దాడులకు భయపడం-భూములను వదులుకోం- నారాయణ, పల్లా వెంకట్ రెడ్డి

హన్మకొండ,జూన్ 23:భూపోరాటాలలో దాడులకు భయపడం అని.. పేదలకు ఇండ్ల స్థలాలు దక్కే వరకూ భూములను వదులుకోమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, సిపిఐ రాష్ట్ర ఇంచార్జి కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి స్పష్టం చేసారు. మంగళవారం హన్మకొండ జిల్లా కేంద్రం సమీపంలోని గుండ్ల సింగారంలో గుడిసె వాసులపై భూ కబ్జా దారుల దాడిలో తీవ్రంగా గాయపడిన పేదలను పరామర్శించేందుకు బుధవారం హన్మకొండకు విచ్చేసిన నారాయణ, పల్లా వెంకట్ రెడ్డి గాయపడిన గుడిసె వాసులను పరామర్శించారు.ఈ సందర్భంగా గుండ్ల సింగారంలో భూమాఫియా ఆగడాల గురించి, పేదలపై జరిగిన దాడి తీరును వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హన్మకొండ బాల సముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ పేదలపై జరిగిన దాడి చాలా బాధాకరమని, ఈ దాడిలో సుమారు 40 మంది గాయపడ్డారని, దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

ఇంతటి ఘటన జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం చూస్తుంటే వారు భూ కబ్జా దారులకు మద్దతునిస్తున్నట్లు స్పష్టమవుతున్నదని అన్నారు. దాడి చేసిన వారిపై పోలీసులు కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుంటే ప్రైవేటు వ్యక్తులు ఎలా దాడి చేస్తారని, రెవెన్యూ, పోలీస్ అధికారులు సమాధానం చెప్పాలన్నారు. గుండ్ల సింగారంలో జరిగిన దాడిలో బిజెపి కార్పరేటర్ రవి నాయక్, మరో 40 మంది పాల్గొన్నారని, వారికి టిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు మద్దతునిస్తున్నారా సమాధానం చెప్పాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పేదలవైపా, భూ కబ్జా దారులవైపో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గుండ్ల సింగారంలో జరిగిన దాడిపై, పోలీసుల తీరుపై రాష్ట్ర డిజిపికి ఫిర్యాదు చేస్తామని, ప్రభుత్వ భూమిపై కోర్టులో ప్రైవేటు కేసు వేస్తామని, అవసరమైతే మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయిస్తామని తెలిపారు. తాము ఇండ్ల స్థలాలు సాధించుకునేందుకు న్యాయ బద్దంగా వెలుతున్నామని, గుండ్ల సింగారం భూములను వదిలి పెట్టమని అన్నారు. సిపిఐ రాష్ట్ర ఇంచార్జి కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ భూ పోరాటాలతో సిపిఐ ప్రాబల్యం పెరుగుతున్నదన్న దురుద్దేశంతోనే స్థానికేతురల పేరుతో గుడిసె వాసులపై దాడి చేసారని అన్నారు. స్థానికులలో కూడా పేదలు ఉంటే గుడిసెలు వేసుకోవచ్చునని, ఇండ్ల స్థలాలు అవసరం ఉన్న అర్హులైన వారెవరైనా గుడిసెలు వేసుకోవచ్చునని అన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నందునే సిపిఐ భూపోరాటాలు నిర్వహిస్తున్నదని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి పేదలకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇండ్లు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. ఇండ్ల స్థలాలు దక్కే వరకూ పోరాడుతామని, గురువారం నుండి హనుమాన్ జంక్షన్ లో సిపిఐ ఆద్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని చెప్పారు. ఈ విలేఖరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, సిపిఐ హన్మకొండ, వరంగల్ జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వలీ వుల్లా ఖాద్రి, మారుపాక అనిల్ కుమార్,ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ స్టాలిన్, నాయకులు బుస్సా రవిందర్, దండు లక్ష్మణ్ గన్నారపు రమేష్, మండ సదాలక్ష్మి, మద్దెల ఎల్లేష్, ఆదరి శ్రీనివాస్, ఉట్కూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

5వ తేదీ నుంచి పాఠశాలల పునఃప్రారంభం.. పది సప్లిమెంటరీకి ఫీజు మినహాయింపు

అమరావతి, జూన్ 23 రాష్ట్రంలో పాఠశాలలు ప్రకటించిన షెడ్యూల్ కన్నా ఒక రోజు ఆలస్యంగా తెరుచుకోనున్నాయి. కొత్త విద్యా సంవత్సరాన్ని జూలై 4 నుంచి ప్రారంభిస్తామని సెలవులకు ముందే విద్యాశాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐదో తేదీన పునఃప్రారంభం పాఠశాలలు కానున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటన జూలై నాలుగో తేదీన ఉండటంతోనే ఒక రోజు ఆలస్యంగా పాఠశాలల పునఃప్రారంభం అవుతున్నట్లు చెబుతున్నారు. ప్రధాని పర్యటనలో మంగళగిరి ఎయిమ్స్‌ను ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జూలై ఐదో తేదీ నుంచి బడులు తెరుచుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రంలో ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు నుంచి మినహాయింపు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయంపై కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆమోదం రావడంతో సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించనక్కర్లేదని, అందరికీ హాల్ టికెట్లు అందిస్తామని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి. దేవానంద రెడ్డి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 6 లక్షల 15 వేల 908 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా వారిలో 67.26 శాతంతో 4 లక్షల 14 వేల 281 మంది ఉత్తీర్ణత సాధించిన విషయం తెలిసిందే. దాదాపు 33 శాతం మందికిపైగా పరీక్షల్లో ఫెయిల్ కావడంతో.. వారందరికీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నెల రోజుల్లోనే నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. సప్లిమెంటరీలో పాసైన వారిని కూడా రెగ్యులర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారితో సమానంగా గుర్తించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఫీజు నుంచి మినహాయింపు కల్పించడం ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయంగా తల్లిదండ్రులు చెబుతున్నారు.

శ్రీకాకుళంలో అమ్మఒడి విడుదల కార్యక్రమం..

పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేలా ప్రారంభించిన జగనన్న అమ్మఒడి ఈ నెల 27న అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ 'ఆంధ్రప్రభ'కు తెలిపారు. రాష్ట్రంలో ఈ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి ఏటా జనవరిలో అమ్మఒడి కింద రూ. 15 వేల చొప్పున విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

అయితే కరోనా కారణంగా గత రెండేళ్లపాటు 75 శాతం హాజరు తప్పనిసరి అనే నిబంధనకు మినహాయింపునిచ్చి నగదు జమ చేసింది. ఈ ఏడాది నుంచి 75 శాతం హాజరు నిబంధనను అమలు చేస్తూ జూన్‌లో అమ్మఒడిని జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 27న శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడి రామమూర్తి క్రీడా మైదానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా అమ్మఒడి నిధుల విడుదల నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు అమ్మఒడిని వర్తింపజేస్తున్నారు. పథకం ప్రారంభించిన సమయంలో రూ. 15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించినా.. అనంతరం రూ. వెయ్యి చొప్పున తగ్గించి ఆ మొత్తాన్ని టాయిలెట్ మెయింటనెన్స్ ఫండ్‌కు కేటాయించాలని నిర్ణయించారు. ఈ ఏడాది మరో రూ. వెయ్యిని పాఠశాలల మౌలిక వసతుల కల్పన కోసం వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 5.58 లక్షల మందికిపైగా అమ్మఒడిని అందించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థుల్లో అమ్మఒడి అందాల్సిన వారు 6.27 లక్షల మందిగా గుర్తించారు.

ఈనెల 26 నుంచి 28 తేదీ వరకు జర్మనీ మరియు యుఎఇ లను సందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 23:జర్మనీ అధ్యక్షత న 2022వ సంవత్సరం జూన్ 26వ తేదీ మరియు 27వ తేదీ లలో జరుగనున్న జి7 శిఖర సమ్మేళనం లో పాలుపంచుకోవాలంటూ జర్మనీ చాన్స్ లర్ శ్రీ ఓలాఫ్ స్కోల్జ్ ఆహ్వానించిన మీదట ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ జర్మనీ లోని శ్లాస్ ఎల్మౌ ను సందర్శించనున్నారు.

ఈ శిఖర సమ్మేళనం లో భాగం గా ప్రధాన మంత్రి పర్యావరణం, శక్తి, జలవాయు, ఆహార భద్రత, ఆరోగ్యం, స్త్రీ పురుష సమానత్వం మరియు ప్రజాస్వామ్యం వంటి అంశాల పై తన ఆలోచనల ను వెల్లడి చేయవచ్చన్న అంచనా ఉంది. ఈ ముఖ్యమైన అంశాల పై అంతర్జాతీయ సహకారాన్ని పటిష్టం చేయడం కోసం జరుగుతున్న ప్రయాస లో భాగం గా అర్జెంటీనా, ఇండోనేశియా, సెనెగల్ మరియు దక్షిణ ఆఫ్రికా ల వంటి ఇతర ప్రజాస్వామిక దేశాల ను కూడా ఆహ్వానించడం జరిగింది. ఈ శిఖర సమ్మేళనం సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దీనిలో పాలుపంచుకొనే దేశాల లో కొన్ని దేశాల నేతల తో ద్వైపాక్షిక సమావేశాలలో పాల్గొంటారు.

భారతదేశాని కి మరియు జర్మనీ కి మధ్య గల బలమైనటువంటి మరియు సన్నిహితమైనటువంటి భాగస్వామ్య సంప్రదాయాని కి అనుగుణం గా, అలాగే ఉన్నత స్థాయి రాజకీయ సంబంధాల ను దృష్టి లో పెట్టుకొని జి7 శిఖర సమ్మేళనాని కి ఆహ్వానం లభించింది. ప్రధాన మంత్రి కిందటి సారి జర్మనీ ని 2022వ సంవత్సరం లో మే 2వ తేదీ నాడు సందర్శించారు. ఆ రోజు న భారతదేశం- జర్మనీ అంతర్ ప్రభుత్వ సంప్రదింపులు (ఐజిసి) యొక్క ఆరో విడత కార్యక్రమం జరిగింది.

జి7 శిఖర సమ్మేళనం లో పాలుపంచుకొన్న తరువాత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2022 వ సంవత్సరం జూన్ 28 తేదీ నాడు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) కి వెళ్తారు.

అక్కడ యుఎఇ పూర్వ అధ్యక్షుడు మరియు అబూ ధాబీ పాలకుడు శ్రీ శేఖ్ ఖలీఫా బిన్ జాయద్ అల్ నాహ్ యాన్ కన్నుమూత పట్ల ప్రధాన మంత్రి తన వ్యక్తిగత సంతాపాన్ని తెలియజేస్తారు. ప్రధాన మంత్రి దీనితో పాటు శ్రీ శేఖ్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నాహ్ యాన్ కు యుఎఇ నూతన అధ్యక్షుని గా, అబూ ధాబీ పాలకుని గా ఎన్నికైన సందర్భం లో అభినందనలు తెలియజేయనున్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అదే రోజు రాత్రి అంటే జూన్ 28వ తేదీ నాటి రాత్రి యుఎఇ నుంచి బయలుదేరుతారు.

జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్న జాతీయ మహిళా కమిషన్-ఎన్‌సిడబ్ల్యు

న్యూఢిల్లీ, జూన్ 23:జాతీయ మహిళా కమిషన్ (ఔఅచి) 'షీ ఈజ్ ఎ చేంజ్ మేకర్' ప్రాజెక్ట్ కింద ఎన్నికైన మహిళా ప్రతినిధుల (ఓఒంల) కోసం జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్ పై వర్క్‌షాప్‌ను నిర్వహించింది, ఇది మహిళా ప్రతినిధుల నాయకత్వ నైపుణ్యాలను మెరుగుపరచడం కోసం కమిషన్ ఉద్దేశించిన పాన్-ఇండియా స్థాయి సామర్థ్య నిర్మాణ కార్యక్రమం.

లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఒబాఔం) నేషనల్ జెండర్ అండ్ చైల్డ్ సెంటర్ సహకారంతో హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో 2022 జూన్ 22 నుండి 24 వరకు మూడు రోజుల వర్క్ షాప్ నిర్వహించారు. వర్క్ షాప్ సందర్భంగా, మహిళా ఎమ్మెల్యేలు 'ప్రభావ నాయకత్వం', 'ఇన్‌క్లూజివ్ గవర్నెన్స్', 'స్త్రీలు, యుక్తవయస్కుల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టితో లింగ-ఆధారిత హింసపై అవలోకనం', 'జెండర్ సెన్సిటివ్ అండ్ ఇన్‌క్లూజివ్ కమ్యూనికేషన్', 'ఎమోషనల్ ఇంటెలిజెన్స్', వంటి విభిన్న సెషన్‌లలో శిక్షణ ఇస్తారు, ఈ వర్క్ షాప్ లో ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుండి 29 మంది పాల్గొంటున్నారు.

ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఈరోజు ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన ప్రారంభ ప్రసంగంలో, ఆమె తన విలువైన అనుభవాలు, నిజ జీవిత ఉదాహరణలతో మహిళా ఎమ్మెల్యేలను ప్రేరణ కలిగించారు. ప్రజాప్రతినిధి జీవితంలో క్రమశిక్షణ ప్రాముఖ్యతను ఆమె నొక్కిచెప్పారు. సమాజంలోని ప్రతి వ్యక్తి సమర్థవంతమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి అట్టడుగు స్థాయి ముఖ్యంగా గ్రామ పంచాయతీ అధికారులతో మెరుగైన సమన్వయం చాలా ముఖ్యమని ఆమె తన ప్రసంగంలో అన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. 'సబ్కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' దిశగా కృషి చేయాలని పాల్గొనేవారికి చెప్పారు.

ఎన్‌సిడబ్ల్యు చైర్‌పర్సన్ శ్రీమతి రేఖా శర్మ తన ముఖ్యోపన్యాసం చేస్తూ, 'సాధికారత కలిగిన మహిళా నాయకత్వం, సాధికారత ప్రజాస్వామ్యం' అనే ఆలోచనతో ఈ వర్క్ షాప్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మహిళా నాయకుల సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించారు.

'షీ ఈజ్ ఎ చేంజ్‌మేకర్' ప్రాజెక్ట్ కింద, కమిషన్ మహిళా ప్రతినిధుల కోసం నిర్ణయాధికారం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ మొదలైనవాటిని మెరుగుపరిచే లక్ష్యంతో ప్రాంతీయ శిక్షణా సంస్థలతో కలిసి సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించింది. కమిషన్ 49 శిక్షణ కార్యక్రమాలను ఇప్పటివరకు నిర్వహించింది. ఎనిమిది రాష్ట్రాల్లోని బ్యాచ్‌ల కింద ఇప్పటి వరకు దాదాపు 1700 మంది పంచాయతీరాజ్ సంస్థలు/పట్టణ స్థానిక సంస్థల మహిళా ప్రతినిధులు శిక్షణ పొందారు.

రైతుబంధు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కి వినతిప్రతం

వరంగల్, జూన్ 23:రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు బంధు నిధులు మంజూరు చేసి ..రైతు ఖాతాలో జమ చేయలంటూ వరంగల్ కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు జిల్లా కాంగ్రెస్ నాయకులు టిపిసిసి ఆదేశాలాల మేరకు హన్మకొండ ఌ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు బందు నిధులు మంజూరు చేసి రైతు ఖాతాలో జమచేయలంటూ వరంగల్ జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో తొలకరి జల్లులు కురిసి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయింది. రాష్ట్ర ప్రభుత్వం జూన్ లో ఇవ్వాల్సిన పెట్టుబడి సహాయం రైతు బంధు పథకం కింద ఇంకా నిధులు రైతుల ఖాతాలోకి రాలేదు. పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రైతు బంధు సాయం సకాలంలో అందకపోవడంతో జిల్లాలోని రైతాంగం ప్రైవేటు అప్పులపైనే భారం వేసి ఎరువులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

రైతు బంధు సాయం అందకపోవడంతో దళారులు, వివిధ సంస్థల వ్యాపారులు, ముఖ్యంగా ఫెర్టిలైజర్, పెస్టిసైడ్, సీడ్ వ్యాపారులు రైతాంగాన్ని మచ్చిక చేసుకొని కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అప్పుగా ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. వారికి వచ్చే రేట్లలో రెండింతలకు అమ్మకంతో పాటు వాటికి వడ్డీ కలిపి వచ్చే ఏడాది అనగా పత్తి లేదా వరి చేతికొచ్చాక తమకే చెప్పిన ధరలకే విక్రయాలు జరపాలన్న ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

దీంతో రైతులు పండించిన పంటలు దళారికి, వ్యాపారులకు అమ్మితే రైతులకు మిగిలేది ఏమి ఉండదని తెలుస్తోంది.

రైతుల పెట్టుబడి కోసం ప్రైవేటు అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ వడ్డీలతో రైతులు నష్టపోతారు.దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఏటా రైతాంగానికి ఇస్తున్న పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందజేయాలని జిల్లా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు బంధు సాయం రిలీజ్ చేయాలని హన్మకొండ ఌ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పక్షాన కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎం.పి. సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పార్లమెంట్ గా పోటీ చేసిన అభ్యర్థి దొమ్మాటి సాంబయ్య, వర్ధన్నపేట నియోజకవర్గ కో-ఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్, టిపిసిసి కార్యదర్శి మహమ్మద్ ఆయూబ్, బొజ్జ సమ్మయ్య యాదవ్, జిల్లా కిస్సాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లేపల్లి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లాలో ఎలుగుబంట్ల సంచారం

అమరావతి, జూన్ 23 అనంతపురం జిల్లాలో రెండు ఎలుగుబంట్లు సంచరించాయి. జిల్లాలోని కళ్యాణదుర్గం మండలం ముదిగల్లులో ఎలుగుబంట్లు సంచరించాయి. ముదిగల్లు శివారు ప్రాంతాల్లో రెండు ఎలుగుబంట్లు సంచరించడంతో గొర్రెల కాపర్లు కేకలు వేశారు. దీంతో అవి కొండల్లోకి వెళ్లిపోయాయి.

కొత్త దృష్టి

"ఈ నవలలో ఎన్నో పాత్రలు. కొన్ని సజీవ పాత్రలు. మరికొన్ని మాజీ ప్రధాని పీ.వీ. రాసిన 'లోపలి మనిషి' నవలలోలాగ సజీవ పాత్రలను కలగా పులగం చేసిన చిత్రణ. కొన్ని ఊహాత్మక పాత్రలు. కొన్ని ఆదర్శ పాత్రలు. వీటిక్కూడా మూలరూపాలు... లేకపోలేదు" అని రచయిత బి.యస్. రాములు అన్నారు. ఆలోచింపజేసి, చైతన్య పరచే ఈ 'చూపు' నవలను ప్రతిరోజు నేటినిజం పాఠకులకోసం...

– సంపాదకులు.



– బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి వైస్ఛాన్స్‌లర్, టీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

19

ఏ రిస్క్ లేకుండా, సమాజంతో ప్రజలతో సంబంధం లేకుండా తన బతుకు తాను హాయిగా జీవించాలనుకునే ఈజీ గోయింగ్ లైఫ్ క్రమ క్రమంగా నూతన తరాన్ని బాగా ఆకర్షిస్తున్నట్టుంది. తల్లీ, తండ్రీ, స్నేహితులు, బంధువులు ఎంతమంది దూరమైనా ఫర్వాలేదు. తాము సుఖపడాలి. హాయిగా ఉండాలి అనే భావాలు ఎవరు నేర్పుతున్నారో? ఎక్కడి నుంచి అంది పుచ్చుకుంటున్నారో? తల్లిదండ్రులకు అర్థం కావడం లేదు.

దయాకర్‌లో పెరుగుతున్న ఏదీ పట్టించుకోని స్వభావాన్ని ఎన్నిసార్లు గుర్తు చేసిందో వాణి! ఎప్పుడూ ఎవరో ఒకరు అనేక పనులు చేసి పెట్టడానికి అందుబాటులో వుండే వారు. పని మనుషులు కూడా వుండేవారు. దాంతో దయాకర్‌కు పని చేయడం పట్ల నిర్లక్ష్యం, తేలిక భావం ఏర్పడిపోయినట్టుంది. కూరగాయలు తెమ్మన్నా అది తన పని కాదన్నట్టు ప్రవర్తించడం వాణి జీర్ణించుకోలేకపోయింది. తాను కొడుకును తీర్చిదిద్దే సమయం లేదు. కాలేజి చదువులతో ఎక్కడెక్కడో స్నేహాలతో ఎక్కడో చదువులు, ఏం చేస్తున్నారో తెలియదు. కొత్త తరం ఎలా రూపుదిద్దుకుంటున్నదో ఈ కాలంలో తల్లిదండ్రులకు తెలియకుండా పోయింది. అడిగినన్ని డబ్బులు పంపిస్తే అమ్మా, నాన్నలు మంచి వాళ్ళు. పంపించకపోతే అమ్మా, నాన్నలు మంచి వాళ్ళు కాదు. వాళ్ళకు ఇంతే తెలుసు అనుకున్నాడు ఆర్‌డీవో వెంకటేశం.

తమ పిల్లలు తమ లాగా తల్లిదండ్రుల అదుపాజ్ఞల్లో పెరగని క్రమం వచ్చేసింది. తమకు తామే ఎలా ఎదగాలో నిర్ణయించుకుంటున్నారు. దూరపు చదువులు, హాస్టల్లో చేర్పించడాలు ఎప్పుడు మొదలయ్యాయో అప్పుడే వాళ్ళకు పూర్తి స్వేచ్ఛ వచ్చేసింది. వాళ్ళకు తోచింది చేస్తారు. ఏమైనా అంటే అలుగుతారు అనుకున్నాడు ఆర్‌డీవో వెంకటేశం. ఫ్యామిలీ ప్లానింగ్ జీవితంలో భాగమై ఒకరిద్దరికే కుటుంబం పరిమితమయ్యాక ప్రేమలు, గారాబాలు, అలకలు మరింత పెరిగిపోయాయి.

×××

ప్రజాప్రతినిధులు, గైడ్ అండ్ ఫిలాసఫర్స్‌గా గౌరవించబడే సన్నిహితు లను అందరూ ఒకచోట క్లోజ్డ్ మీటింగ్‌లో ముచ్చటించుకుంటున్నారు. ఆ ప్రతిపాదన ప్రిన్సిపాల్ రామచంద్రయ్య, ప్రొఫెసర్ లక్ష్మీపతిలది. దాన్ని సరే అంటూ ఆర్గనైజ్ చేసింది ఎం.పి. రాజన్న. ప్రొ. కె. జయశంకర్, ప్రొ. బియ్యాల జనార్ధన్‌రావు, ప్రొ. సత్యనారాయణ, ఆర్డీవో వెంకటేశం, ఎంఈవో సత్తయ్య, ఇండస్ట్రియలిస్ట్ ప్రభాకర్, కాంట్రాక్టర్ భాస్కర్ తమ ప్రాంత అభివృద్ధి గురించి అనేక కోణాల్లో చర్చిస్తున్నారు.

"1994 నుండి చంద్రబాబు టీడీపీ ప్రభుత్వం రిటైరైన ఉద్యోగుల ప్లేస్‌లో కొత్తవాళ్ళను తీసుకోవడం లేదు. రెండున్నర లక్షల పోస్టులను అవసరం లేదని రద్దు చేసిండు. ఇలా రెండున్నర లక్షల మంది విద్యావంతుల పొట్టల కొట్టిండు. అవుట్ సోర్సింగ్ పేరుతో పార్ట్ టైమ్ లెక్చరర్‌లతో పని తీసుకుంటున్నరు. అన్ని డిపార్ట్‌మెంట్లలో ఇదే తంతు. అవుట్ సోర్సింగ్ అంటే పని తీసుకొని వదిలేయడం. వాడుకొని వదిలేయడం. అవుట్ సోర్సింగ్ కోసం ఉద్యోగులను సప్లయ్ చేసే కాంట్రాక్టర్లను బతికిస్తూ పనిచేసే వారిని ఉద్యోగులుగా కాకుండా కూలీలుగా మార్చడం." అన్నాడు ప్రొ. జయశంకర్.

"మనం మాట్లాడుకున్నదంతా బాగానే వుంది. కానీ మనం కోరుతున్న వాటిల్లో చాలా మేరకు ప్రభుత్వం మీద ఆధారపడి కోరుతున్నం. స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు మెడికల్ కాలేజీలు, హాస్పటల్స్, రోడ్లు, రవాణా సౌకర్యాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఆర్టీసీ డిపోలు, రింగ్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నల్లా నీళ్లు మొదలైనవన్నీ ప్రభుత్వ బడ్జెట్లను ఆశించేవే. ఒక్క మాటలో చెప్పాలంటే వెల్ఫేర్ స్కీమ్స్‌లో భాగమే. ఇది ప్రభుత్వం మీద ఆధారపడే నమూనానే తప్ప స్వయం పోషకం ఎలా అయితది?" అన్నాడు ఎం.పి. రాజన్న.

లక్ష్మిపతి, రామచంద్రయ్య, ఎంఈవో సత్తయ్య మొదలైన మేధావులు, విద్యావంతులు ఆ మాటతో ఆలోచనలో పడ్డారు. నిజమే! తాము ఎందుకు అన్నీ వెల్ఫేర్ స్కీమ్స్‌నే కోరుతున్నారు? ఎందుకు ఉత్పత్తి సంపద గురించిన ఎకానమీ మాట్లాడలేకపోతున్నారు అని ఆలోచనలో పడిపోయారు. ఎవరో అన్నట్టు తమదంతా 'వెల్ఫేర్ ఎకానమీ... సంక్షేమ అర్థశాస్త్రం'లో భాగంగా దానికే ప్రతిదీ పరిమితమవుతున్నది. ఎందువల్ల? తమలో తాము చాలాసేపు చర్చించుకున్నారు. తమకున్న ఎంప్లాయీ సైకాలజీ తమ దృక్పథంలో ప్రవేశించింది అని ఎక్కడో లీలగా తోస్తోంది. క్రమంగా అది నిజమేనని అనిపిస్తోంది.

ఎంప్లాయీ సైకాలజీ అంటే ఏమిటి? నెలకోసారి జీతం వస్తుంది. ఆ జీతం మీద ఆధారపడి అన్ని విషయాలను నిర్ణయించుకుంటారు. ఉద్యోగుల జీతమే వాళ్ల జీవితాల్ని నిర్దేశిస్తుంది. వాళ్లదంతా జీతం బతుకులు. వాళ్లు అన్నీ ఎదురు చూడ్డానికే అలవాటు చేస్తుంది ఆ బతుకు. జీతం చాలకపోతే డిమాండ్ చేసి సాధించుకుంటారు. ఇలా డిమాండ్ చేసి సాధించుకోవడం గొప్ప అనుకున్నారు. కానీ ఇది ఎదుటి వారి మీద ఆధారపడే డిపెండెంట్ సైకాలజీ. ఎంప్లాయర్, మేనేజ్‌మెంట్ తమకు సంపాదించి పెట్టాలని కోరుకుంటున్నారు. అందుకు వారి కోసం పని చేసి పెడతామని పరిమిత మవుతున్నారు. ఈ ఆలోచనలోనే డిపెండెంట్ సైకాలజీ కొనసాగుతున్నది.

తాము ఉద్యోగస్తులుగా బతకడం వల్ల డిపెండెంట్ సైకాలజీతో ప్రతిదీ ఎవరో చేయాలని, ప్రభుత్వమే అందుకు పూనుకోవాలని లేదా తల్లిదండ్రులే తమను ఉన్నతంగా చదివించాలని, మంచి ఇళ్లు కట్టించాలని... వగైరా వగైరా ఆలోచనల్లో, ఆశల్లో ఉన్నదంతా డిపెండెంట్ సైకాలజీయే. ఇదంతా రకరకాల సెంటిమెంట్లు, బాధ్యతలు, హక్కులు, సంస్కృతి రూపంలో కూడా కొనసాగుతున్నది.

ఈ విషయం అర్థం కావడంతో ప్రొఫెసర్ లక్ష్మిపతి ఒక్కసారిగా చకితుడయ్యాడు. తాము ఎంత చదివినా, తాము పుట్టి పెరిగిన సాంఘిక నేపథ్యం నుండి స్వతంత్రంగా ఆలోచించే స్థాయికి ఎదగలేకపోతున్నాం. తాము పుట్టి పెరిగిన సామాజిక నేపథ్యం దాన్ని వదిలించుకున్నా కానీ అది కట్టుకొయ్యలా తన చుట్టూ తానే మనను తిప్పుతోంది. కంపార్ట్‌మెంటల్ ఐడియాలజీకి పరిమితమైపోతున్నాం. తమలాంటి వారిని తయారు చేయడానికే తమ ఆలోచన పరిమితమవుతున్నది. అంతే తప్ప మొత్తం సమాజం, మొత్తం దేశం సంపన్నం కావడానికి విభిన్న రంగాల్లో ఎదగడానికి తమ దృష్టి ఎదగడం లేదు...

ఇలా రెండవ తరం, మూడవ తరం మధ్య తరగతిలో కూడా ఎంప్లాయీ సైకాలజీని, కస్టమర్ సైకాలజీని పెంచింది. తల్లిదండ్రులను చూసి వారిలాగే బాగా చదువుకోవాలని, ఏదో ఒక మంచి ఉద్యోగంలో చేరి స్థిరపడాలని కోరుకున్నారు. కష్టపడి చదివి అందగలిగిన ఉద్యోగాలు అందుకున్నారు. తిరిగి తల్లిదండ్రుల్లాగే చిన్నా, పెద్ద ఉద్యోగాల్లో బతుకుతూ వస్తున్నారు. జీవిత లక్ష్యాలు, గమ్యాలు అలా గానుగ ఎద్దులాగా కట్టుకొయ్య చుట్టూతా గడ్డిమేసే దూడలాగా పరిమితికి లోనైంది. వ్యక్తిత్వంలోనే కంపార్టమెంటలైజేషన్ పెరిగింది. అది మనది కాదు. ఇది మనకు అందదు. అంత రిస్క్ అక్కర్లేదు. వాళ్లతో పోటీ పడలేం. అలా నెగ్గుకు రాలేం వంటి భావాలతో వాళ్లు కేవలం ఉద్యోగాలకు పరిమితమయ్యారు. ప్రతి ఉద్యోగి కూడా ఎంప్లాయీ సైకాలజీలోకి, కస్టమర్ సైకాలజీలోకి మారక తప్పదు.

అలా ఎన్ని తరాలు గడిచినా ఇలాంటి మధ్య తరగతి నుండి ఎంటర్‌ప్రెన్యూర్ సైకాలజీ ఎదగలేదు. నూతన అవకాశాలను అందిపుచ్చుకొనే చొరవ నశించింది. నూతన అవకాశాల్లో పెరిగే ఉద్యోగాల కోసం మాత్రం పోటీ పడ్డారు... ఇలా థాట్ పోలిసింగ్‌కు గురైన్రు. ఈ సైకాలజీనుండి బయటపడాలి...

దీన్నుంచి బయటపడాలంటే ఆ సామాజిక నేపథ్యం నుండి బయట పడాలి. అంటే ఎంప్లాయీ సైకాలజీ నుండి ఎంప్లాయర్‌గా, జాబ్ సీకర్స్ నుంచి జాబ్ గివర్స్‌గా, మేనేజ్‌మెంట్‌గా, పారిశ్రామిక వేత్తగా, ప్రభుత్వాధి నేతలుగా ఎదగాలి. చూడబోతే పెళ్లయ్యే దాకా పిచ్చి కుదరదు. పిచ్చి కుదిరే దాకా పెళ్లి కాదు అన్నట్టుగా వుంది. కలెక్టర్ అయ్యే దాకా కలెక్టర్‌గా స్వభావం సంతరించుకోవడం సాధ్యం కాదు. కలెక్టర్ అయితేనే కలెక్టర్ స్వభావం సంతరించుకుంటారు.

రైస్ మిల్లర్ రామేశం ఆశ్చర్యపోయాడు. ఎంఈవో సత్తయ్య ఆలోచిస్తున్నాడు. ప్రిన్సిపాల్ రామచంద్రయ్య తాము ఎక్కడ, ఎందుకు ఆగిపోతున్నామో తనలో తాను విశ్లేషించుకుంటున్నారు. వాటి మూలాలు తన జీవన విధానంలోనే వున్నాయా...! అని ఆశ్చర్యపోయాడు. ఉద్యోగం పురుష లక్షణం అంటే తాము నిజంగానే ఇన్నేళ్ళుగా నమ్ముతూ వచ్చారు. ఇది ఎంత తప్పుడు మాట. ఇది యజమానులు తమకు అనువుగా వుండే విధంగా ప్రజలను మలచడానికి ఇచ్చిన నిర్వచనం అని ఇప్పుడు అనిపిస్తోంది. ఉద్యోగం పురుష లక్షణం కాదు... ఉద్యోగం బానిస లక్షణం. నిజంగానే తాము ఉద్యోగాన్ని ఏ లక్ష్యం, ఏ లక్షణాలతో చేస్తున్నారు? ఇన్నాళ్ళు ఏదో విద్యార్థులకు, సమాజానికి సేవ చేస్తున్నాము అనే ఒక తృప్తి ఉండేది. కానీ ఇదేదో ఆ తృప్తిని కూడా మిగలనీయకుండా చేస్తోంది అనుకున్నారు ఆర్డీవో వెంకటేశం, ఎంఈవో సత్తయ్య, ప్రిన్సిపాల్ రామచంద్రయ్య.

'ఈ విషయాలు తన చిన్నప్పుడే తెలిస్తే మస్కట్, దుబాయ్ పోతున్నవాళ్ల ఆదాయాన్ని చక్కని పెట్టుబడిగా మార్చే కృషి చేస్తూ వాళ్లు ఇక్కడే స్కూళ్ల, కాలేజీలు, వ్యాపారాలు పెట్టుకొని ఆటోలు, జీపులు, కార్లు, లారీలు, పవర్ టిల్లర్‌లు, ట్రాక్టర్లు, క్రేన్లు నడుపుకొని బతికే విధంగా మైండ్‌సెట్ మార్చే అవకాశం వుండేది... అనుకున్నాడు. మన సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌కి ఈ విషయాలు ముందే తెలిపితే వాళ్ల విభిన్న రంగాల్లో తమ ఆదాయాన్ని పెట్టుబడులుగా మార్చి వ్యాపారాలు, పరిశ్రమలు వగైరా పెంచడం ద్వారా స్థానిక అభివృద్ధికి, ఉపాధికి, లాభాలకు ఎంతో అవకాశం వుండేది...' అనుకున్నాడు ఎం.ఈ.వో సత్తయ్య.

"ప్రభుత్వం ద్వారా కుటుంబ నియంత్రణ ప్రచారం జరిగి మేమిద్దరం, మాకిద్దరు, మేమిద్దరం మాకొకరు అనేది జీవితంలో భాగమైపోయింది. తల్లిదండ్రులు ఇద్దరూ పని చేస్తూ సంపాదిస్తూ కూడా తమ పిల్లలను తమ కన్నా ఉన్నతంగా మధ్య తరగతిగా ఎదిగించడానికి ఎందుకు వీలు కావడం లేదు? వెనకట పది మంది, ఎనిమిది మంది పిల్లల్ని కంటే వాళ్లంతా మధ్య తరగతిగా ఎదిగే క్రమం, అవకాశం కొనసాగింది. ఇప్పుడు ఒక్కర్ని కన్నా ఆ అవకాశం ఎందుకు రావడం లేదు. ఏం జరిగింది?" అన్నాడు ఎంఈవో సత్తయ్య.

"ఆయా సాంప్రదాయక కులవృత్తుల్లో ఉండి పోతున్న వాళ్లు ఎప్పుడూ మధ్య తరగతిగా ఎదగలేరు. ఇప్పటివరకు అలా ఎదిగిన వారు ఎవరూ లేరు. ఆధునిక విద్య అందుకున్న వాళ్లే మధ్య తరగతిగా ఎదుగుతున్నారు. కుల వృత్తి రహిత సమాజం ఏర్పడాలి. కులవృత్తులు రద్దు కావాలి. కుల వృత్తులు రద్దయి అందరూ మధ్య తరగతి స్థాయికి ఎదిగితేనే దేశం అభివృద్ధి చెందుతుంది" అన్నాడు ప్రొ. లక్ష్మీపతి.

ప్రొ. జయశంకర్ ప్రొ. లక్ష్మీపతిని అభినందించాడు. అది సాధ్యమా? అన్నట్టు ప్రొ. బియ్యాల జనార్ధన్‌రావు ప్రశ్నించాడు. కాంట్రాక్టర్ భాస్కర్, లక్ష్మీపతితో ఏకీభవిస్తూ మరో మాట జోడించాడు.

"అలా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సైకాలజీకి తెలంగాణ సమాజం ఎదిగి ఉంటే ఇతర ప్రాంతాల వాళ్లు మన మీద పెత్తనం చేసే అవకాశం ఉండేది కాదు. వాళ్లతో పోటీపడి మనం కూడా ఎదిగి ఉండే వాళ్లం. అన్నీపోంగ మనకెంత మిగులుతుంది అని ఆలోచించడం పారిశ్రామిక, ఆధునిక అభివృద్ధి విధానం. వాళ్లకెందు కియ్యాలె అని ఆలోచించడం భూస్వామ్య ఆలోచనా విధానం. మన తెలంగాణాలో భూస్వామ్య ఆలోచనా విధానమే కొనసాగు తున్నది. అందువల్ల వాడెంత, వీడెంత అనుకుంటూ వానికెందుకియ్యాలె అనుకుంటూ వెనుకబడిపోతున్నరు. నేను ఈ ఆలోచనా విధానం నుంచి బయట పడడానికి నామీద నేను ఎంత యుద్ధం చేసిన్నో..." అన్నాడు కాంట్రాక్టర్ భాస్కర్.

"మన ప్రాంత ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రయివేటు ఉద్యోగాలు, పరిశ్రమల్లోని ఉపాధి మొత్తం మన ప్రాంతం వారికే చెందాలె. ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ, అగ్రికల్చర్ వంటి డిపార్ట్‌మెంట్లలో మన ప్రాంతంలో అంతా మన వారికే ఉద్యోగాలు లభించాలె. ప్రభుత్వ ఉద్యోగాలు వున్న వాళ్లు వారికుండే భూములను ఇతరులకు అమ్మాలె. లేదా అన్నదమ్ములకు ఇచ్చి వేయాలె. భూమిని ఆస్తిగా కాకుండా ఉపాధి కల్పనగా, పరిశ్రమగా లెక్కించాలె. తద్వారా భూమిని కలిగి వున్న వాళ్లు ప్రభుత్వ ఉద్యోగాలు చేయడానికి వీల్లేదు అని చట్టాలు చేయాలె. రెండు ఉద్యోగాలు, రెండు ఉపాధులు ఒకేసారి చేయడం కుదరదు. కనుక భూమిని వదిలేసుకోవాలె అన్నాడు ప్రిన్సిపాల్ రామచంద్రయ్య.

ఆ మాటతో ఎంఈవో సత్తయ్యతో పాటు ఇండస్ట్రియలిస్ట్ ప్రభాకర్, కాంట్రాక్టర్ భాస్కర్ ఖంగుతిన్నారు.

ఆర్‌డీవో వెంకటేశం శరీరం ఇక్కడే వున్నా మనస్సు ఎక్కడో తిరుగు తోంది. దయాకర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్వభావం రాకుండా, రిస్క్ తీసుకొని ఎదగాలనే వ్యక్తిత్వం వికసిం చకుండా, పదిమందికి తానే ఉపాధి కల్పిస్తాననే లక్ష్యం ఎదగకుండా కేవలం ఎంప్లాయీ గా బతకాలనే ఆలోచన తన ఉద్యోగ జీవితం వల్లే రూపుదిద్దుకుందా? తాను నిత్యం ఎదుర్కొంటున్న టెన్షన్ వల్లే దయాకర్ సుఖంగా, ప్రశాంతంగా, హాయిగా తనకు తాను బతకాలని అమెరికా వెళ్ళాలనుకుం టున్నాడా? అని ఆలోచిస్తూ దయాకర్ ఎదుగుతూ వచ్చిన క్రమాన్ని, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నాడు ఆర్‌డీవో వెంకటేశం.

"కాలంతో పాటు మనం మారాలె. ఈ కాలంలో అందర్నీ గౌరవించడం అవసరం. గవర్నమెంట్ అటెండర్ కూడా గౌరవాన్ని కోరుకుంటడు. కూలి మేస్త్రీ కూడా గౌరవాన్ని కోరుకుంటడు. కాలం మారింది. మనం కూడా అందుకు అనుకూలంగా మారాలె. మన మైండ్‌సెట్ మారితే లోకం అంతా మనకు అనుకూలంగా స్పందిస్తుంది. సహకరిస్తుంది." గంభీరంగా చిరునవ్వుతో అన్నాడు కాంట్రాక్టర్ భాస్కర్.

"ఇతరులకు రిస్క్ తీసుకోవడం అలవాటు కాలేదు. అందువల్ల చాలామంది ఇతరుల చేతి కింద ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడుతున్నరు తప్ప తనకు తాను స్వయంగా ఎదగడానికి కృషి చేయడం లేదు. రిస్క్ తీసుకోవడం లేదు..."

"మొదట్లో నా దగ్గర ఏపాటి ఉండేదో మీకు తెలుసు. ఆత్మవిశ్వాసం, ధైర్యం, సాహసం, జీవిత లక్ష్యం ఉదాత్తంగా, ఉన్నతంగా ఉండడం ముఖ్యం. నేను నా కన్నా బాగా ఎదిగిన వాళ్లను నా లక్ష్యంగా నిర్ణయించుకున్న. వారిని అధిగమించాక ఇంకా పై స్థాయి వాళ్లను చేరుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నాను. అలా నడుస్తోంది వ్యవహారం. అయినా ఎన్ని అడ్డంకులో.. సిమెంట్ ఫ్యాక్టరీకి ఎంత ప్రయత్నం చేసినా ఎమ్మెల్యే, ఎంపీలు నలుగురు పట్టుబట్టినా మనకు రాకనే పోయె. విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు పెడదామని ఢిల్లీ దాకా చక్కర్లు కొట్టినా లక్షల రూపాయలు ఖర్చుయిపోయినయి తప్ప ఒక్క యూనిట్ కూడా శాంక్షన్ కాలేదు. పర్వతనేని ఉపేంద్ర తన అల్లుడని లగడపాటి రాజగోపాల్‌కు శాంక్షన్ చేయించె. కమ్మాస్ ఒక కులమే అన్నిట్ల ఆధిపత్యం. సీమాంధ్ర వాళ్లకు తప్ప, తెలంగాణ రెడ్లకు కూడా ఏమీ అందనిస్తలేదు. అన్నీ వాళ్లే ఎత్తుకుపోయిండ్రు. లరాగో, కాసారా, రాసారా, తిసురా... వంటి పెద్ద చేపలు చిన్న చేపలను బతుకనిస్తలేవు... మన గోదావరిఖనిలో బొగ్గుంటే ఇక్కడ ప్లాంట్లకు పర్మిషన్ ఇవ్వకుండా ఎక్కడికో తరలించుకుపోయి అక్కడ ధర్మల్ విద్యుత్ ప్లాంట్లు పెట్టుకుంటున్నరు.

"ప్రజల ఆదాయం పెంచే బదులుగా సబ్సిడీలు ఇవ్వడం అనేది తలకిందుల వ్యవహారం. ఈ సబ్సిడీ బడ్జెట్లతో ప్రజల ఆదాయాన్ని పెంచే ప్రణాళికలు చేపట్టడం అవసరం. లక్షల కోట్ల బడ్జెట్ భారీ ప్రాజెక్టుల పేరిట కొందరి చేతుల్లోకి వెళ్లిపోతున్నది. సబ్సిడీల పేరిట లక్షలు, కోట్లు వంతుల వారీగా వికేంద్రీకృతంగా పంపిణీ చేయబడుతున్నది.

మీరేం చేస్తున్నరు?" కోపంగా అన్నాడు ఇండస్ట్రియలిస్ట్ ప్రభాకర్.

"మీరన్నది నిజమే. కానీ ఏం చేసుడు? అసెంబ్లీలో వాళ్లదే మెజార్టీ. మూడింట రెండు వంతులు వాళ్లే. వాళ్లకు అణిగిమణిగి ఉండే వాళ్లకే టిక్కెట్లు ఇస్తున్నరు. పార్లమెంటుకు కూడా వాళ్లు చెప్పిన వారికే టిక్కెట్లు తెప్పించు కుంటున్నరు. గట్టిగా అడిగితే రెండోసారి టిక్కెట్టే రాకుండా చేస్తున్నరు."

"అంతేకాదు ఎంపీ సాబ్! మేం ఎంత క్వాలిటీ వర్క్ చేసినా మాకు పేరు రావడం లేదు. వాళ్లకు మాత్రమే టెండర్లు దొరికేటట్టు నిబంధనలు పెడతరు. కాంట్రాక్టు దొరికించుకుంటున్రు. మనకు ఏదో దానం ఇచ్చినట్టుగా, దయతల్చినట్టుగా సబ్ కాంట్రాక్టులు ఇస్తున్నరు. సబ్ కాంట్రాక్టులో ఎంత క్వాలిటీ పని చేసినా పేరంతా వాళ్లకే. పని చేయకుండానే వాళ్లకు వందల కోట్ల లాభాలు,... మొబిలైజేషన్ పేరిట అడ్వాన్సులు. పెట్టుబడి లేకుండానే వేల కోట్లు సంపాదన. సీమాంధ్ర కమ్మలు, రెడ్లు, రాజులు రాజకీయాధి కారంతో అన్ని రంగాల్లోకి విస్తరిస్తున్నరు. మీరేమో ఎంత సపోర్ట్ చేసినా తెలంగాణలో అభివృద్ధి సాధించడం మాత్రం శూన్యం." మెత్తగా మర్యాదగా నవ్వుతూ చురకలు అంటించాడు ప్రభాకర్

"మీకు తెల్వనది ఏముంది? అంతా వాళ్ల రాజ్యమే. వాళ్లు తినంగా మిగిలింది మనకు ఇంత వదిలేస్తున్నరు. అందుకే మనోళ్లు బలార్షా, నాగపూర్, చంద్రపూర్, అమరావతి, ఔరంగాబాద్, బొంబైలలో వాళ్లను వీళ్లను పట్టి వర్క్ సంపాదించుకునుడు అయితున్నది" అంటూ ఎమ్మెల్యే గంగారాం ఆ మాటతో ఏకీభవించాడు.

ఎమ్ఈవో సత్తయ్య, ప్రిన్సిపాల్ రామచంద్రయ్య అనేక విధాలుగా సేకరించిన అంశాలను తమ ప్రాంత అభివృద్ధి పథకాలను సంక్షిప్తంగా అందరిముందుంచారు.

"గోదావరి, కృష్ణా నది, మంజీరా నదుల మీద సాగునీటి ప్రాజెక్టులు కట్టకుండా నీళ్లన్నీ వృధాపోతున్నయి. సముద్రంలో కలుస్తున్నయి. కానీ తెలంగాణలో మాత్రం అభివృద్ధి కావద్దని, ఇట్లే ఉండాలని కుట్ర చేస్తున్రు. లక్షల మంది బొంబైకి, దుబాయికి వలసపోబట్టిరి. పాలమూరు జిల్లా నుంచి అయితే సగం జనాభా తట్ట, బుట్ట పట్టుకొని దేశమంతా తిరగబట్టె. నల్గొండలో రక్షిత మంచినీరు ఏర్పాటు చేయకపోవడం వల్ల అక్కడి నీళ్లలోని ఫ్లోరోసిస్‌తో బొక్కలు, కాళ్లు చేతులు వంగిపోబట్టె. అయినా వాళ్లకు కనికరం లేదు. వాళ్ల స్వార్థం తప్ప మనగురించి ఆలోచించేది లేదు. నైజాం ఎప్పుడో నూట నలభయ్యేళ్ల కింద కడదామని ఆలోచించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు ఇప్పటికీ దిక్కులేకపోయె. నాగార్జునసాగర్ మన కోసమని చెప్పిరి, మనకు కాకుండా వాళ్లే వాడుకోబట్టిరి. మనకు ఒక పంటకు నీళ్లు దిక్కులేవు. కానీ వాళ్లు రెండు మూడు పంటలకు నీళ్లు కావాలని బడ్జెట్‌లన్నీ అటే మలుపుక పోతున్నరు. మన దగ్గర గవర్నమెంట్ స్కూలు, కాలేజిలు పెట్టుమన్నా కూడా బడ్జెట్ లేదంటున్నరు. అక్కడ చదువుకొని ఇక్కడికచ్చి ఇక్కడి మన ఉద్యోగాలన్నీ కొట్టేస్తున్నరు. ఇట్ల అన్నిట్లల్ల మోసమే. ప్రాజెక్టులతో వాళ్ల పొలాలకు నీళ్లిస్తున్నప్పుడు మనకు నీళ్ల కోసం పంపుసెట్లకు ఉచితంగా కరెంటు ఇయ్యాలె" అన్నాడు ప్రొ. జయశంకర్.

"ప్రజల ఆదాయం పెంచే బదులుగా సబ్సిడీలు ఇవ్వడం అనేది తలకిందుల వ్యవహారం. ఈ సబ్సిడీ బడ్జెట్లతో ప్రజల ఆదాయాన్ని పెంచే ప్రణాళికలు చేపట్టడం అవసరం. లక్షల కోట్ల బడ్జెట్ భారీ ప్రాజెక్టుల పేరిట కొందరి చేతుల్లోకి వెళ్లిపోతున్నది. సబ్సిడీల పేరిట లక్షలు, కోట్లు వంతుల వారీగా వికేంద్రీకృతంగా పంపిణీ చేయబడుతున్నది. దాంతో కొత్త ఆధిపత్య వర్గాలు పెరిగాయే తప్ప ప్రజల మౌలిక ఉత్పాదనలో, ఆదాయంలో, నైపుణ్యంలో మార్పు సాధ్యం కాలేదు. ప్రభుత్వం ప్రైవేటు హాస్పటల్స్‌కు ఇస్తున్న బడ్జెట్‌తో ప్రభుత్వమే అంతకన్నా ఎక్కువ హాస్పటల్స్‌ను నిర్వహించ వచ్చు..." అంటూ ఆగాడు ప్రొ. లక్ష్మీపతి.

ప్రొ. జయశంకర్, ప్రొ. లక్ష్మీపతి చెప్పినవన్నీ వింటూ అందరు నిజమే నన్నారు. మన ప్రాజెక్టుల ఆవశ్యకత గురించి చాలాసేపు చర్చించారు. స్థానిక పారిశ్రామిక అభివృద్ధికి ఇండస్ట్రియలిస్ట్ ప్రభాకర్, రీజినల్ లీడ్ బ్యాంకు మేనేజర్ అనేక సూచనలు చేశారు.

"సోలార్ విద్యుత్తు, చెరుకు పిప్పి, ఇథనాల్, బయోడీజిల్, కానుగ చెట్ల పెంపకం, పవన విద్యుత్తు, కర్రతో ఆట వస్తువుల తయారీ, మెమెంటోల తయారీ, మేదర బుట్టల తయారీ, పేపర్ బ్యాగ్స్, జూట్ బ్యాగ్స్, తోళ్ల పరిశ్రమ, రెడీమేడ్ పెటీకోట్స్, రెడీమేడ్ డ్రెస్ మేకింగ్ యూనిట్స్, డ్రాయర్లు, బనీన్లు, టీషర్ట్స్ మేకింగ్ యూనిట్స్, హల్దీరామ్ వంటి ఉత్పత్తులు, రెడీమేడ్ ఫాస్ట్‌ఫుడ్స్, రీసైకిలింగ్ పరిశ్రమలు, గోడౌన్స్, కోల్డ్ స్టోరేజి, చేపల ఎగుమతి, పౌల్ట్రీ ఎగుమతులు, పాల ఎగుమతులు, కల్లుకు బదులుగా నీరా తయారీ... ఎగుమతులు, అప్పాలు, గారెలు, చకినాలు, ఫర్నిచర్, రీప్యాకింగ్ చేసే ఫార్మాస్యూటికల్స్, ఆయుర్వేద పొడర్స్, లేహ్యాలు, హైబ్రీడ్ విత్తనాల తయారీ, సేమ్యాలు, చెగోడీలు, చేతికాగితంతో గ్రీటింగ్ కార్డ్స్, పెళ్ళి కార్డ్స్, కూరగాయల పెంపకం, రూఫ్‌కింద ఆధునిక పద్ధతుల్లో కూరగాయల పెంపకం, అటవీ ఉత్పత్తుల పెంపకం, సిమెంట్ బ్రిక్స్, టమాటా సాస్, మిర్చి సాస్, సంత్రా సాస్, మామిడి సాస్, కోళ్ల దాణా, కాగితంతో విస్తార్లు, మక్కలతో స్టార్చ్ తయారీ, పెద్ద కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని బ్రాండెడ్ సబ్బులు, బ్రెడ్ మొదలైన వాటి యూనిట్‌లు స్థానిక అభివృద్ధికి, ఉపాధి కల్పనకు స్థానిక మార్కెట్ నుండి జాతీయ స్థాయి మార్కెట్‌కు ఎదగడానికి పనికొస్తాయి... ఫైనాన్స్ కంపెనీల ద్వారా ప్రజల నుండి చిన్న చిన్న మొత్తాలను డిపాజిట్లుగా సేకరించి పెట్టుబడి సమకూర్చుకోవచ్చు. ఇండస్ట్రియల్ యూనిట్స్ ఏర్పాటు చేయవచ్చు. బ్యాంకు లోన్లు తీసుకోవచ్చు." ఇలా అనేక విషయాలు చర్చలు చేశారు. చివరకు ఎవరు ఏ బాధ్యతలు తీసుకుంటారో చర్చించారు.

ఆర్టీసీ డిపోలు పెంచడానికి, ట్రాక్టర్లు, పెట్రోల్ పంపులు, రోడ్లు, చక్కెర ఫ్యాక్టరీ, అగ్రికల్చరల్ యూనివర్సిటీ, ఇండస్ట్రియల్ పార్క్, రైల్వే లైన్, హౌసింగ్ కార్పొరేషన్ గురించి ఎమ్మెల్యే గంగారాం బాధ్యత స్వీకరించాడు. టౌన్ హాల్, ఫంక్షన్ హాల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, పార్క్‌లు, రోడ్లు, కూరగాయల మార్కెట్ల గురించి మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మమ్మ బాధ్యత తీసుకున్నారు. రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లుల గురించి, చింతగింజల పొడిగురించి, వేప నూనె మిల్లు గురించి మిల్లర్స్ అసోసియేషన్ అ

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి : సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితా సభర్వాల్

జనగామ, జూన్ 23:పల్లెల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని, గతంకంటే ప్రస్తుతం పల్లెల రూపురేఖలు మారాయని సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. గురువారం ఆమె జనగామ జిల్లాలోని నేలపోగుల గ్రామంలో పర్యటించారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీ, క్రీడా ప్రాంగణం వైకుంఠధామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో గ్రామాల్లోకి ఎండాకాలంలో అధికారులు వెళ్లాలంటే జంకేవారు. తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు అందిస్తూ నేలపోగుల గ్రామం అభివృద్ధిలో ఉండడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఎంవో ఓఎస్డీ ప్రియాంక వర్ఘీస్, పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ శివలింగయ్య, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్డీవో పీడీ రామ్ రెడ్డి, సర్పంచ్ దూసరి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా దుల్హాన్ పథకాన్ని నిలిపేశాం: ఏపీ ప్రభుత్వం

అమరావతి, జూన్ 23 దుల్హన్ పథకాన్ని నిలిపివేస్తున్నట్టు హైకోర్టుకు ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ పథకాన్ని నిలిపివేస్తున్నట్టు చెప్పింది. ముస్లిం యువతుల వివాహం కోసం గత టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద ముస్లిం యువతుల వివాహం కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 50 వేలు ఇచ్చేది.

ఈ పథకం కింద రూ. 50 వేల సాయాన్ని లక్ష రూపాయలకు పెంచుతామని ఎన్నికల సమయంలో జగన్ హామీ ఇచ్చారాణి, అయితే, ఆ హామీని వైసీపీ ప్రభుత్వం నెరవేర్చలేదంటూ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నేత షిబ్లి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని పిటిషన్ లో పేర్కొన్నారు. పిటిషన్ విచారణ సందర్భంగా ప్రభుత్వ తరపు న్యాయవాది వాదిస్తూ? పథకం అమలుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవని కోర్టుకు తెలిపారు. దీంతో, రిప్లై పిటిషన్ దాఖలు చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

మంత్రి హరీష్ రావు పై బాలకృష్ణ ప్రశంసలు

హైదరాబాద్, జూన్ 23:సినీ నటుడు , హిందూపురం ఎమ్మెల్యే అలాగే ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ..తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రశంసలు కురిపించారు. బసవతారకం క్యాన్సర్ 22వ వార్షికోత్సవ వేడుకలకు హరీషరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ..హరీష్ రావు ప్రజల మనిషి అని ఆయన కొనియాడారు. ఆదర్శమైన నాయకుడు హరీష్ రావు అని, హాస్పిటల్ లోకి వచ్చిన వెంటనే.. మనో వ్యాధి తగ్గుతుందని, ఒక్కసారి వెళ్లి కలిస్తేనే.. ఆరు కోట్ల రూపాయిలను మాఫీ చేశారు బాలకృష్ణ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య శ్రీ కింద పేషెంట్ లను ట్రీట్ చేస్తున్న హాస్పిటల్స్ లలో సెకండ్ ప్లేస్ ఉన్నామని, ఎంతోమంది దాతలు హాస్పిటల్ కు సాయం చేస్తున్నారన ఆయన వెల్లడించారు.

మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ అంటే ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో అభిమానం అని పేర్కొన్నారు. ఈ దారిలో కేసీఆర్ వెళ్తున్నప్పుడు క్యాన్సర్ ఆస్పత్రి, ఎన్టీఆర్ గురించి ఎన్నో విషయాలు గుర్తుకు చేసుకునే వారని తెలిపారు. నైట్ షెల్టర్ ఏర్పాటు చేయాలని సీఎం చెప్పగానే బాలకృష్ణ అమలు చేశారు. బాలకృష్ణ అడగగానే బిల్డింగ్ రెగ్యులరైజేషన్ కింద రూ. 6 కోట్ల భారం పడకుండా సీఎం కేసీఆర్ చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయని పని ఇది అని గుర్తు చేశారు. క్యాన్సర్ రోగుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 753 కోట్లు ఖర్చు చేసిందని హరీశ్‌రావు తెలిపారు. ఇందులో అత్యధికంగా బసవతారకం ఆస్పత్రికి వెళ్లిందన్నారు. ఈ 22 ఏండ్లలో 3 లక్షల రోగులకు ఈ ఆస్పత్రి సేవలందించడం గొప్ప విషయమన్నారు.

అమ్మ ఒడిలో కోత నిజమే : ఏపీ మంత్రి బొత్స

అమరావతి, జూన్ 23 ఏపీలో విద్యార్థుల కోసం అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకంలో కోతలు విధించిన విషయాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ అంగీకరించారు. విద్యార్థులు అర్థాంతరంగా బడి మానేయకుండా అమ్మ ఒడిని ప్రారంభించిందని మరోసారి స్పష్టం చేశారు. విజయనగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 75 శాతం హాజరు ఉన్న విద్యార్థులకు అమ్మ ఒడిని ఇస్తున్నామని పేర్కొన్నారు.

ఇందులో నుంచి వెయ్యి రూపాయలు మెయింటెనెన్స్‌కు, మరో వెయ్యి వాచ్‌మెన్, ఇతర అవసరాలు వినియోగిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని విద్యార్థులకు మెరుగైన విద్యాభ్యాసం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తెలుసుకుని తమతమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని సూచించారు.

ఏపీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం అమ్మ ఒడి స్కీం క్రింద ప్రతి ఒక్క విద్యార్థికి రూ.15 వేలు ఇస్తుండగా ఈ సంవత్సరం నుంచి 13వేలు మాత్రమే ఇస్తూ 2వేలు కోత విధించింది.

నిమ్జ్ లో వెమ్ టెక్నాలజీస్ నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి కేటీఆర్

- రూ.1000 కోట్లతో 511 ఎకరాల్లో సమీకృత రక్షణ ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన.



సంగారెడ్డి, జూన్ 22 (నేటి నిజం ప్రతినిధి) నేషనల్ ఇన్వెస్ట్మెంట్ అండ్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ జోన్ (జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి)లో రక్షణ రంగం పరికరాల తయారీ పరిశ్రమ వెమ్ టెక్నాలజీస్ పరిశ్రమ నిర్మాణ పనులకు ఝరాసంగం మండలం పరిధిలోని చీలపల్లి, ఎల్గోయి, బర్దిపూర్ శివార్లలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కె. తారకరామారావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెమ్ టెక్నాలజీస్ సంస్థ రక్షణ రంగంలో ఎన్నో విశేషమైన సేవలు అందిస్తూ దేశంలో టాప్ 5 వ స్థానంలో ఉన్నదని, అలాంటి సంస్థ నిమ్జ్ లో 1000 కోట్ల పెట్టుబడితో 511 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానుందన్నారు. రక్షణ రంగానికి చెందిన వివిధ రకాల సామాగ్రి, పనిముట్ల తయారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పరిశ్రమ స్థాపనతో ప్రత్యక్షంగా రెండు వేల మందికి పరోక్షంగా నాలుగు వేల మందికి ఉపాధి లభించనుందన్నారు . వెమ్ చుట్టూ వివిధ అనుబంధ చిన్న పరిశ్రమలు వస్తాయని, మరిన్ని ఉపాధి అవకాశాలు సృష్టించడానికి అవకాశం ఉందన్నారు. భారత దేశ రక్షణకు సంబంధించిన క్లాసిఫైడ్ పనులు జరుగుతుంటాయని, డిఫెన్స్ సెక్టార్ దినదినంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

స్కిల్డ్, సెమి, అన్ స్కిల్డ్ కేటగిరీలలో మాత్రం స్థానిక యువతకు ప్రాధాన్యతనిచ్చి ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలని పరిశ్రమ యాజమాన్యాన్ని మంత్రి కోరారు.

స్థానికులతో మమేకమై వారి గ్రామాలలో కావలసిన అవసరాలు తీర్చే విధంగా చొరవ చూపాలన్నారు. పరిశ్రమలు రావాలి, కానీ పర్యావరణ హితంగా ఉండాలన్నారు. అప్పుడే స్థానికులు అన్ని విధాల సహకరిస్తారని పేర్కొన్నారు.

నిమ్జ్ కోసం 12,650 ఎకరాల స్థలం గుర్తించామని, ఇప్పటికీ మూడు వేల ఎకరాలు మాత్రమే సేకరించామన్నారు. భూముల ధరలు బాగా పెరిగాయని, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ నిమ్జ్ లో భూములు కోల్పోయిన రైతులందరికీ సరైన పరిహారం ఇవ్వడంతోపాటు వారి కుటుంబానికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

50 శాతం కంపెనీ ,50 శాతం ప్రభుత్వ వాటా తో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లయితే స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి మంచి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని పరిశ్రమ చైర్మన్ వెంకట రాజు మంత్రిని కోరగా, అందుకు తగిన చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ కు సూచించారు.

అనంతరం జహీరాబాద్ లోని బాగా రెడ్డి స్టేడియం లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. 2014 కు ముందు, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి ఏ విధంగా ఉన్నదో ప్రజలు గమనించాలన్నారు.

జహీరాబాద్ పట్టణానికి 2014 నుండి బ్రహ్మాండమైన రోడ్లు, బటర్ఫ్లై లైట్లు, జంక్షన్ ల ఏర్పాటు చేశామని, అం దుకు రూ.34 కోట్లు అందజేశామన్నారు. జహీరాబాద్ పట్టణంలో 14.5 కోట్ల రూపాయల వ్యయంతో సమీకృత వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ నిర్మిస్తున్నామని, ఆగస్ట్ లోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.

రూ.4.10 కోట్ల తో వైకుంఠధామం నిర్మిస్తున్నామని, మున్సిపాలిటీ లోని ప్రతి వార్డు లో తెలంగాణ క్రీడాప్రాంగణం పేరిట ఒక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. హరితహారం కార్యక్రమం లో 2.55 కోట్ల ఖర్చుతో నర్సరీ పెట్టి చెట్లు నాటామని తెలిపారు. పట్టణ ప్రగతి లో భాగంగా పారిశుద్ధ్యం, ఇతర కార్యక్రమాలకు ఇప్పటికే రూ.18.79 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.

మరో 50 కోట్లతో మూడు ముఖ్యమైన కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి, సిసి రోడ్లు, డ్రైనేజీలు ఇతర సౌకర్యాల కోసం ఇచ్చామన్నారు.

జైరాబాద్ మున్సిపాలిటీ లో విలీనమైన శివారు గ్రామాలలో త్రాగునీటికి మిషన్ భగీరథ కింద 66 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. మున్సిపాలిటీ ఏర్పాటు ఐన తరువాత మొట్టమొదటిసారిగా ఒక మున్సిపాలిటీకి 50 కోట్లు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్ దేనని ఆయన అన్నారు.

రాష్ట్రంలోని ప్రతి పట్టణం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుందని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత 40 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే అందరికీ వచ్చే రెండు మూడు నెలల్లో పింఛన్లు ఇస్తామని తెలిపారు.

జహీరాబాద్ నియోజకవర్గ ప్రాంత రైతుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరబోతోందన్నారు. సంగమేశ్వర ఎత్తిపోతల తో నియోజకవర్గంలోని లక్షా ఆరు వేల ఎకరాల సాగుకు గోదావరి నీళ్లు అందించనున్నట్లు తెలిపారు.

అనంతరం స్వయం సహాయక సంఘాలకు 54 కోట్ల రూపాయల బ్యాంకు రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

అనంతరం జహీరాబాద్ పట్టణములో 50 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఎం జి ఈ వి వాయు-021 కంపెనీ తయారుచేసిన ఎలక్ట్రికల్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను మంత్రి ప్రారంభించారు.

మహీంద్రా అండ్ మహీంద్రా ఫ్యాక్టరీ వారు ఉత్పత్తి చేసిన మూడవ లక్ష ట్రాక్టర్ ను మార్కెట్లోకి విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా అందుకు అనుగుణంగా నైపుణ్య తకు మెరుగులు పెట్టుకుంటూ ముందుకు వెళ్లాలని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం రైతుల పొట్ట గొట్టే ప్రభుత్వం కాదని, ఏ రైతుకు నష్టం జరగకుండా తగిన పరిహారం ఇచ్చి భద్రత కల్పిస్తామన్నారు. నిమ్జ్ లోనే వారి పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, శాసనమండలి సభ్యులు షేరీ సుభాష్ రెడ్డి, యాదవ రెడ్డి, టీఎస్ ఉమెన్ కమిషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, శాసనసభ్యులు మాణిక్ రావ్, భూపాల్ రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ మిశ్రా, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, జిల్లా ఎస్పీ రమణకుమార్, ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాతృత్వం ఓ తీయని మమకారం

-మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

ప్రభుత్వ దవాఖానాల్లోనే ప్రసూతి కావాలి
ప్రసవాల్లో ఆపరేషన్లను నివారించాలి
ప్రజలంతా అవగాహనతో మెలగాలి
150 మంది గర్భిణీలకు ఘనంగా చీర, సారెలతో సత్కారం

మహబూబాబాద్, జూన్ 23: ఎర్రబెల్లి ట్రస్టు సహకారంతో, వందేమాతరం ఫౌండేషన్ సామూహిక శ్రీమంతోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఉషా దయాకర్ రావు దంపతులుతొర్రూరు (మహబూబాబాద్ జిల్లా, పాలకుర్తి నియోజకవర్గం), జూన్ 23ఃమాతృత్వం ఓ తీయని మమకారం. అనవసర ఆపరేషన్లు చేయించుకోవద్దు. ప్రభుత్వ దవాఖానాల్లోనే ప్రసూతి కావాలి. సుఖ ప్రసవాల (ఈజీ డెలివరీల)కే ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరాశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, వారి సతీమణి, ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్ పర్సన్, శ్రీమతి ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు పట్టణంలో ఎర్రబెల్లి ట్రస్ట్ సహకారంతో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 150మంది గర్భిణీలకు చీర, సారెలతో సత్కరించారు. అనంతరం వారినుద్దేశించి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడారు. ప్రతి బిడ్డా తల్లి కావాలనుకుంటుంది. సృష్టిలో మాతృత్వానికి అంత విలువే కాదు. ఎనలేని మమకారం ఉంది. అందుకే ఈ సృష్టి ఇలా కొనసాగుతూ ఉంది. వెనుకటికి మంత్రసానులు ప్రసవాలు చేసేవారు. అయితే, మారిన ఆధునిక కాలంతో పాటు ప్రసవాలలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. ఇప్పుడన్నీ సెక్షన్, సిజేరియన్ అంటున్నారు. దీని వల్ల చిన్న వయసులోనే తల్లులు అయిన వారంతా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. గర్భ సంచీలు తీసివేయాల్సి రావడం, పీరియడ్స్ లో తేడాలు, వెన్ను నొప్పులు వంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. వీటన్నింటినీ అదిగమించాలంటే... గర్భిణీలు కచ్చితంగా ఈజీ డెలివరీలకే ప్రాధాన్యమివ్వాలని, అలా గర్భిణీల భర్తలు, కుటుంబ సభ్యులు సిద్ధమవ్వాలి. అందుకే ఆపరేషన్లు లేని ప్రసవాలు జరిగే విధంగా ప్రయత్నించాలని మంత్రి ఎర్రబెల్లి ఉద్బోధించారు. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావుతో కలిసి కొన్ని సమావేశాల్లో పాల్గొనగా, గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులే ఆపరేషన్లను ప్రోత్సహిస్తున్నారని, ఇంకొందరు తేదీ, తిథి చూసుకుని ఆపరేషన్లు చేసి ప్రసవాలు చేయాలని తమపై ఒత్తిడి తెస్తున్నారని డాక్టర్లు అంటున్నారన్నారు. ధైర్యం చేసి వైద్యం చేస్తే, వికటించిన సందర్భాల్లో తమ దవాఖానాలపై దాడులు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ దశలో ప్రజలే చైతన్యమవ్వాలని సూచించారు. ఒక అవగాహనతో మెలగాలని చెప్పారు. ముందు నుంచే తగు జాగ్రత్తలు, ఎక్సర్ సైజులు చేస్తే, సుఖ ప్రసవాలు జరుగుతాయని సైన్స్, డాక్టర్లు, నిపుణులు చెబుతున్నారని మంత్రి అన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణీలు సైతం కొంత బాధలు భరించైనా ఈజీ డెలివరీలకే ప్రాధాన్యమివ్వాలని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా గర్భిణీలకు చీరె, సారెలు పెట్టారు. వారిని సత్కరించారు. గర్భిణీలుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలు, ప్రసవాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక్, వందేమాతరం ఫౌండేషన్ తక్కెళ్ళపల్లి రవిందర్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, అనేక మంది మహిళలు, గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించేందుకే భరోసా కేంద్రం- స్వాతి లక్రా

గద్వాల ,జూన్ 23: గద్వాల జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రం..స్త్రీ బాలల సహాయ కేంద్రాన్ని స్వాతి లక్రా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ..మహిళల జోలికొస్తే ఎంతిటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు డీజీపీ, ఉమెన్ సెఫ్టీ విభాగం అధికారి స్వాతి లక్రా తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, గద్వాల జిల్లా జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య, జిల్లా కలెక్టర్ శ్రీహర్ష, పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భరోసా కేంద్రాలతో బాధిత మహిళలకు తక్షణ సాయం అందుతుందని స్పష్టం చేశారు.

దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మహిళ రక్షణ కోసం సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. చట్టాలపై మహిళలకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా మహిళల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వేధింపులు ఎదుర్కొంటున్న బాధిత మహిళలకు అండగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోక్సో, లైంగిక దాడి కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు భరోసా కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సఖీ, షీ టీమ్స్ ఏర్పాటు చేసి మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించిందన్నారు.

పటాన్‌చెరు నుండి లడక్ వరకు సైకిల్ యాత్ర

మెదక్, జూన్ 23 (నేటినిజం ప్రతినిధి): ఇటీవల పటాన్ చెరు పట్టణం నుండి లడక్ వరకు 2600 కిలోమీటర్ల దూరాన్ని సైకిల్ పైన సాహస యాత్ర ద్వారా చేరుకున్న పటాన్చెరు పట్టణానికి చెందిన వెంకటేష్ అనే యువకుడిని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రశంసించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేష్ ని ఎమ్మెల్యే జీఎంఆర్ స్వయంగా పూలమాలలతో సత్కరించారు. యాత్ర విశేషాలను, యాత్రలో ఎదుర్కొన్న అనుభవాలను వెంకటేష్ ను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబం నుండి వచ్చిన వెంకటేష్ చిన్ననాటి కలను సాకారం చేసుకోవడానికి సాహస యాత్ర నిర్వహించడం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భవిష్యత్తులో వెంకటేష్ చేసే సాహస యాత్రలకు, అతని చదువుకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, సోమ శీనయ్య, తెరాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ వకుళమాత ఆలయాన్ని ప్రారంభించిన ఏపీ సీఎం

తిరుపతి, జూన్ 23:తిరుపతి సమీపంలోని పేరూరు బండపై పునర్నిర్మించిన శ్రీ వకుళమాత ఆలయాన్ని ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో సీఎం ను సన్మానించి శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

మంత్రి పెద్దిరెడ్డి తన సొంత నిధులతో పాటు టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వకుళ మాత ఆలయం వద్ద 83 ఎకరాల 42 సెంట్ల భూమి ఉందని, ఈ ప్రాంతంలో టీటీడీ కల్యాణ మండపం, అతిథి భవనం నిర్మిస్తుందని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు. దాదాపు 20 కేజీల బంగారంతో ఆలయ గోపురానికి 5 కలశాలు, విమానానికి ఒక కలశం టీటీడీ సహకారంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అంతకుముందు ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీఎంకు రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి, నారాయణస్వామి, రోజా, టీటీడీ ఈవో ధర్మారెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కుక్కి సుబ్రమణ్య పీఠాధిపతి

తిరుపతి, జూన్ 23:దక్షిణ కర్ణాటకలోని కుక్కి సుబ్రమణ్యంలో ఉన్న శ్రీసుబ్రమణ్య మాతా పీఠాధిపతి శ్రీ విద్యాప్రసన్న తీర్థరు స్వామిజీ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం తిరుమలకు చేరుకున్న శ్రీవిద్యాప్రసన్న తీర్థరు స్వామిజీని ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గర్భాలయంలోకి తీసుకెళ్లారు. ఆయన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం టీటీడీ డిప్యూటీ ఈఓ హరింద్రనాథ్ ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వీజీఓ బాలిరెడ్డి, బొక్కసం క్లర్క్ గురురాజరావు, పర్వతేయాదార్ తులసి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీవిద్యాప్రసన్న తీర్థరు స్వామిజీ మాట్లాడుతూ.. స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని చెప్పారు. స్వామివారి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుకున్నట్లు స్వామిజీ పేర్కొన్నారు.

12వ తరగతి వరకు కామన్ యూనిఫామ్

హైదరాబాద్, జూన్ 23: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు కామన్ యూనిఫామ్‌ను అమలు చేయనున్నారు. 1 నుంచి 12వ తరగతి వరకు గల బాలబాలికలందరికీ తలా రెండు జతల యూనిఫామ్‌లను ఉచితంగా ఇవ్వనున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ స్కూళు, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు ఒకే కలర్‌తో కూడిన యూనిఫామ్‌లను పంపిణీ చేస్తారు. అయితే ఈ యూనిఫామ్‌లకు కావాల్సిన వస్త్రాన్ని జిల్లాలకు అధికారులు ప్రస్తుతం సరఫరా చేస్తున్నారు.

జులై 15 కల్లా ఒక జత, ఆగస్టు 15 కల్లా మరో జతకు కావాల్సిన వస్త్రాన్ని జిల్లాలకు చేరవేసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మొత్తం 26,79,497 మంది విద్యార్థులకు 1,40,21,286 మీటర్ల వస్త్రం పట్టనుంది. మొదటి విడతలో 67,75,522 మీటర్లను, రెండో విడతలో 63,30,858 మీటర్ల వస్త్రాన్ని అందజేస్తారు. ఒక్కో జతకు కుట్టుకూలీగా రూ.50 ఇచ్చి మహిళా సంఘాలతో కుట్టించనున్నారు.

ఆత్మకూరులో ప్రశాంతంగా పోలింగ్..

3గంటల వరకు 55శాతం పోలింగ్

అమరావతి, జూన్ 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు అసెంబ్లీ ఉప ఎన్నికకు పోలింగ్ కొనసాగుతోంది. అక్కడ నిర్వహిస్తున్న పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుంది. చెదురుమదురు సంఘటనలు మినహా ఎలాంటి ఘటనలు చోటుచేసుకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇవాళ ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం మూడు గంటల అధికార వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్రిపాడు మండలం బ్రాహ్మణ పల్లెలో తన తల్లి మణిమంజరి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా వచ్చి ఓటు హక్కు వినియోగించు కుంటున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

సాయి చరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి జగదీష్ రెడ్డి

నల్గొండ జిల్లా, జూన్ 23:అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఇటీవల దుండగుల కాల్పుల్లో మృతి చెందిన నక్క సాయి చరణ్ కుటుంబ సభ్యులను విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పరామర్శించారు. గురువారం నల్లగొండ పట్టణంలోని సాయి చరణ్ ఇంటికి చేరుకున్న మంత్రి ప్రమాద ఘటన గురుంచి అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామన్నారు. మంత్రి వెంట నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

దేశంలో కొత్తగా 13,313 మందికి కరోనా

న్యూఢిల్లీ, జూన్ 23: దేశంలో కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. బుధవారం 12 వేలకుపైగా కేసులు నమోదవగా, కొత్తగా 13,313 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో మొత్తం కేసులు 4,33,44,958కి పెరిగాయి. ఇందులో 4,27,36,027 మంది బాధితులు కోలుకోగా, 83,990 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇప్పటివరకు 5,24,941 మంది బాధితులు మృతిచెందారు. కాగా, బుధవారం ఉదయం నుంచి ఇప్పటివరకు 38 మంది మరణించగా, 10,972 మంది కోలుకున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది.

మొత్తం కేసుల్లో 0.19 కేసులు యాక్టివ్‌గా ఉండగా, రికవరీ రేటు 98.60, మరణాలు 1.21 శాతంగా ఉన్నాయని తెలిపింది. రోజువారీ రికవరీ రేటు 2.03 శాతానికి పెరిగిందని ప్రకటించింది. దేశవ్యాప్తంగా 196.62 కోట్ల మందికి కరోనా వ్యాక్సినేషన్ చేశామని వెల్లడించింది.



ఆటలు చదువులో భాగం కావాలి: మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, జూన్ 23: చదువులో భాగంగా విద్యార్థులు ఆటలాడాలని మంత్రి నిరంజన్ రెడ్డి (ఔఠితీజీనితీజీని తీవటటఎ) అన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్ కోసమే పాఠశాలల్లో ఆటలు ఆడిస్తారని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అందులో భాగం కావాలన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సాహం అందిస్తున్నదని చెప్పారు. ఒలింపిక్ డే సందర్భంగా వనపర్తి జూనియర్ కాలేజీలో ఒలింపిక్ టార్చ్‌ను వెలిగించి ర్యాలీని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మన ఊరు – మన బడి పథకంతో పాఠశాలల ముఖచిత్రాలు మారిపోతాయన్నారు.

పాఠశాలల్లో వంటగది, మరుగుదొడ్లు, డిజిటల్ క్లాస్ రూంలు, క్రీడా మైదానాలు, విద్యుత్ సౌకర్యం, డైనింగ్ హాళ్లు వంటి వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ విద్యారంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలపాలనేదే సీఎం కేసీఆర్ ఆశయమని చెప్పారు. క్రీడాకారులకు అన్నివిధాలుగా ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.

కాగా, వాలీబాల్ పోటీల్లో దేశం తరపున ఆడిన చిట్యాల తూర్పు తండాకు చెందిన శాంతాకుమారికి సొంతంగా రూ.లక్ష సాయం అందించారు. ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించామని చెప్పారు.

పెన్షనర్ల కోసం సమగ్ర పోర్టల్!

న్యూఢిల్లీ, జూన్ 23: పెన్షన్–పెన్షనర్ల సంక్షేమ శాఖ (డి.ఒ.పి.పి.డబ్ల్యు) నిర్వహించిన రెండు రోజుల బ్యాంకర్ల అవగాహనా కార్యక్రమం ఉదయపూర్‌లో జరిగింది. 2022 జూన్ 20, 21వ తేదీల్లో ఈ కార్యక్రమం జరిగింది. పెన్షన్ సంబంధిత కార్యకలాపాలను చూసే భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్.బి.ఐ.) ఉత్తర ప్రాంతీయ అధికారులకోసం ఈ కార్యక్రమం నిర్వహించారు.

కేంద్రప్రభుత్వ పెన్షనర్ల పెన్షన్ పంపిణీకి సంబంధించిన విధాన సంస్కరణలు, డిజిటైజేషన్ ప్రక్రియ తదితర అంశాలపై డి.ఒ.పి.పి.డబ్ల్యు. అధికారుల బృందం తరగతులు నిర్వహించింది. ఎస్.బి.ఐ. క్షేత్రస్థాయి అధికారులకు సమాచారాన్ని నవీకరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెన్షనర్లకు సంబంధించిన ఆదాయం పన్ను వ్యవహారాలు, వార్షిక జీవన ప్రమాణ పత్రాలను సమర్పించేందుకు డిజిటల్ మార్గాల గురించి ప్రత్యేక సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ పెన్షన్ అక్కౌంటింగ్ కార్యాలయానికి చెందిన పెన్షన్ల విభాగం చీఫ్ కంట్రోలర్ మాట్లాడుతూ, పెన్షనర్ల సమస్యలకు కారణాలేమిటో వివరించారు. సమస్యల పరిష్కారానికి బ్యాంకర్లు తీసుకోవలసిన చర్యలను కూడా సూచించారు.

పెన్షనర్లకు నిర్విరామంగా, నిరాటంకంగా సేవలందించేందుకు వీలుగా, డి.ఒ.పి.పి.డబ్ల్యు.ను ఎస్.బి.ఐ. ప్రస్తుత పోర్టళ్లను అనుసంధానిస్తూ పెన్షనర్లకోసం ఒక సమగ్రమైన పోర్టల్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

భారత ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు సక్రమంగా బట్వాడా కావాలంటే, క్షేత్రస్థాయి అధికారులకు, పెన్షనర్లకు తగిన అవగాహన కల్పించడం చాలా అవసరం. డిజిటల్ జీవన ప్రమాణ పత్రం కోసం పెన్షనర్ ముఖ ధ్రువీకరణ ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర గురించి బ్యాంకులు తమ ప్రకటనల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఇక క్షేత్రస్థాయి అధికారులు, పెన్షనర్లు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు డి.ఒ.పి.పి.డబ్ల్యు. విధానపరమైన చర్యలు తీసుకుంటుంది. డిజిటల్ జీవన ప్రమాణ పత్రం, ముఖ ధ్రువీకరణ సాంకేతిక పరిజ్ఞానం వంటివి జీవన ప్రమాణ పత్రాల సమర్పణ ప్రక్రియలో పెనుమార్పులకు దోహదపడతాయి. పెన్షనర్లకు, బ్యాంకర్లకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు బ్యాంకు అధికారులకు తమ సామర్థ్యాల నిర్మాణంలో ఎంతగానో దోహదపడతాయి.

కంద్రీయ పెన్షన్ ప్రాసెసింగ్ కేంద్రాలకు, వివిధ బ్యాంకుల్లో పెన్షన్ సంబంధిత పనులను నిర్వర్తించే క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్వహించే అనేక అవగాహనా కార్యక్రమాల పరంపరంలో భాగంగా ఈ తొలి కార్యక్రమం నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పెన్షనర్ల 'సౌకర్య జీవనం' విస్తృతం చేయాలన్న లక్ష్యం చాలావరకు సాధ్యమవుతుందని భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి సిబ్బంది అంతటికీ వర్తించేలా ఎస్.బి.ఐ. సహకారంతో ఇలాంటి అవగాహనా కార్యక్రమాలను నాలుగింటిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. అదే పద్ధతిలోనే పెన్షన్లను బట్వాడా చేసే బ్యాంకుల సహకారంతో అవగాహనా కార్యక్రమాలను 2022–23వ సంవత్సరంలోనే నిర్వహిస్తారు.

ఉదయపూర్‌లో నిర్వహించిన రెండు రోజుల బ్యాంకర్ల అవగాహనా కార్యక్రమం జూన్ 21న ముగిసింది. డి.ఒ.పి.పి.డబ్ల్యు. సంయుక్త కార్యదర్శి సంజీవ్ ఎన్. మాథుర్ ముగింపు ప్రసంగం చేశారు. పెన్షనర్ల 'సౌకర్య జీవనం' లక్ష్యంగా క్రియాశీలక మార్పులు చేసేందుకు అవసరమైన విధాన చర్యలపై బ్యాంకు అధికారుల అభిప్రాయాలను కూడా ఈ కార్యక్రమంలో సేకరించారు. దేశం ఉత్తరాది కేంద్రీయ సెంట్రల్ ప్రాసెసింగ్ కేంద్రాలు, పెన్షన్ బ్రాంచీలకు చెందిన 50మంది అధికారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను కూడా ముగింపు కార్యక్రమంలో ప్రదానం చేశారు

ఇక రాజకీయాలకు దూరం : మాజీ మంత్రి

అమరావతి, జూన్ 23 మాజీ మంత్రి, టీడీపీ నాయకురాలు గల్లా అరుణకుమారి ఇక రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. తన కుమారుడు గల్లా జయదేవ్ టీడీపీ నుంచి ఎంపీగా పనిచేస్తున్నాడని టీడీపీకి తన మద్దతు ఉంటుందని వెల్లడించారు. ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడారు. టీడీపీకి తాము పెద్ద దిక్కుకాదని, చంద్రబాబే పార్టీకి పెద్ద దిక్కని స్పష్టం చేశారు.

తన అనుచరులకు స్వేచ్ఛ ఇచ్చానని, ఎక్కడ నచ్చితే అక్కడ ఉండొచ్చని సూచించానని తెలిపారు. రాజకీయాల్లో చేయని పదవీ లేదు,చూడని రాజకీయం లేదని పేర్కొన్నారు.

చిత్తూరు జిల్లా కు చెందిన గల్లా అరుణకుమారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా , ఒకసారి మంత్రిగా పనిచేశారు.

2014లో రాష్ట్ర విభజన అనంతరం ఏపీ టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోఓడిపోయారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా కొనసాగిన ఆమె 2019 ఎన్నికల్లో నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన నాటి నుంచి టీడీపీకి దూరంగా ఉంటున్నారు.

అర్హులందరికీ దళిత బంధు

-దళిత బంధు అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జూన్ 23:కొన్ని శతాబ్దాలుగా సామాజిక వివక్షకు, అణిచివేతకు గురువుతున్న దళితులను సంపూర్ణ సాధికారులను చేయడానికి సీఎం కేసీఆర్ దళిత బంధు పథకం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం గోల్నాక డివిజన్ సెల్వాగార్డెన్‌లో దళిత బంధు పథకం రెండో విడుత ఎంపికైన రెండు వందల మంది లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ఎమ్మెల్యే హాజరై.. పథకం సద్వినియోగంపైారు. అవగాహన కల్పించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో దళితుల జీవితాల్లో గుణాత్మక మార్పుకోసం సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా దళిత బంధు పథకం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే వంద మంది లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేశామని తెలిపారు.మరో 15వందల కుటుంబాలకు గాను ప్రస్తుతం రెండు వందల కుటుంబాలు ఎంపిక చేశామని వివరించారు. ప్రాధాన్యత క్రమంలో నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి పథకం ప్రయోజనాన్ని వర్తింప జేస్తా మని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు గురి కావద్దని సూచించారు. లబ్ధిదారులు తమ ఇష్టమైన రంగంలో రాణిం చి దళిత బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగడంతో పాటు జీవితంలో స్థిరపడాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. దళిత బంధు పథకాన్ని ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శంగా అమలు చేస్తున్నామని, ఎవరైనా దళారులు పథకం కోసం డబ్బులు అడిగితే నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు. అలాంటి వారిపై కఠినంగా వ్యవహిస్తామని హెచ్చరించారు. రూ.పది లక్షలతో ఒకే యూనిట్ కాకుండా కుటుంబంలోని సభ్యులకు రెండు, మూడు యూనిట్లు కూడా ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ఆదాయాన్ని ఇచ్చే యూనిట్లు ఎంపిక చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

జికా వైరస్‌కు వ్యాక్సిన్..! శాస్త్రవేత్తల సన్నాహాలు..!!

న్యూఢిల్లీ, జూన్ 23:జికా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తూనే ఉన్నది. ఇప్పటిదాకా దీనికి ఎలాంటి మందులూ, వ్యాక్సిన్లూ లేవు. నివారణ ఒక్కటే మార్గం. ఏడిస్ జాతి దోమల ద్వారా జికా వైరస్ వ్యాపిస్తుంది. యుగాండాలోని జికా అనే అడవి పేరు ఈ వైరస్‌కు పెట్టారు. మొట్టమొదటగా 1947లో యుగాండాలోని ఆ అడవిలోని కోతుల్లోనే ఈ వైరస్‌ను గుర్తించారు. 1952లో తొలిసారిగా మనుషుల్లోనూ గుర్తించారు. వైరస్ సోకితే జ్వరం, కీళ్ల నొప్పులు, తలనొప్పి, కళ్లు చర్మం ఎర్రబారడం లక్షణాలు కనిపిస్తాయి. అయితే, వైరస్‌ను కట్టడి చేసేందుకు దేశంలో వ్యాక్సిన్ తయారీకి శాస్త్రవేత్తలు సన్నాహాలు ప్రారంభించారు. నోయిడాలో జరిగిన ఓ వర్క్‌షాప్‌లో కొవిడ్‌పై నేషనల్ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఎన్‌కె అరోరా ఈ విషయాన్ని ప్రకటించారు.

ప్రతి స్థాయిలో సన్నాహాలు..

దేశంలోని పలుచోట్ల జికా వైరస్ కేసులు నమోదయ్యాయని డాక్టర్ ఆరోరా తెలిపారు. దీంతో ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఈ వైరస్ కొవిడ్ మహమ్మారి అంత ప్రమాదం కానప్పటికీ దేశంలో పలు సందర్భాల్లో కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే వైరస్‌కు అడ్డుకట్ట వేసేందుకు అన్నిస్థాయిల్లో నిపుణులు సన్నాహాలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో జికా వైరస్ కేసులు రికార్డయ్యాయి. కొత్త కొత్త వైరస్‌లతో జనం బెంబేలెత్తుతుండగా.. ప్రస్తుతం జికా నుంచి జనాన్ని రక్షించేందుకు వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు డాక్టర్ అరోరా చేసిన ప్రకటన ఊరట కల్పిస్తున్నది.

పిల్లల్లోనే ప్రమాదకరం..

జికా వైరస్ ఇతర వ్యక్తులతో పోలిస్తే గర్భిణులు, పిల్లల్లోనే ప్రమాదకరమని డాక్టర్ అరోరా తెలిపారు. ఎందుకంటే గర్భధారణ సమయంలో వైరస్ సోకితే.. అది శిశువుపై దుష్ప్రభావాలను కలిగిస్తుంది. శిశువు తల సాధారణం కంటే పెద్దదిగా.. లేదంటే చిన్నదిగా ఉండొచ్చు. దీంతో పాటు పిల్లల ఎత్తు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా డాక్టర్ అరోరా వర్క్‌షాప్‌లో కొవిడ్ వ్యాక్సినేషన్‌కు సంబంధించిన విషయాలను వెల్లడించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఇతర మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ.. వ్యాక్సినేషన్‌కు సంబంధించి దేశంలో ప్రతి స్థాయిలో విస్తృతంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 100శాతం లక్ష్యం చేరేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత నెల ఒకటి నుంచి ఇంటింటికీ టీకాల పంపిణీని ప్రారంభించినట్లు చెప్పారు.

శివసేన ఎవరితోనైనా వెళ్లవచ్చు కాంగ్రెస్‌కు సమస్య లేదు: నానా పటోలే

ముంబై మహారాష్ట్ర రాజకీయాలు పలు మలుపులు తిరుగుతున్నాయి. శివసేన మంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో ఆ పార్టీకి చెందిన 40 మందికిపైగా ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి అస్సాం రాజధాని గౌహతిలో మకాం వేశారు. దీంతో శివసేన చీలికదశకు చేరగా, ఆ పార్టీ చీఫ్, సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ప్రభుత్వం పడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ నేపథ్యంలో శివసేన ఎంపీ సంజయ్ రౌత్, గురువారం కీలక ప్రకటన చేశారు. రెబల్స్ ఎమ్మెల్యేలు ముంబైకి తిరిగి వచ్చి సీఎం ఉద్ధవ్ ఠాక్రేతో చర్చిస్తే ఎంవీఏ కూటమిని వీడేందుకు కూడా సిద్ధమని అన్నారు.

కాగా, సంజయ్ రౌత్ వ్యాఖ్యలపై మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ప్రభుత్వంలో భాగంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కలత చెందింది. శివసేన ఎవరితోనైనా వెళ్లవచ్చని, దీని వల్ల కాంగ్రెస్‌కు ఎలాంటి సమస్య లేదని ఆ పార్టీ మహారాష్ట్ర చీఫ్ నానా పటోలే అన్నారు. బీజేపీని అధికారంలోకి రాకుండా ఆపేందుకే తాము శివసేనతో కలిసి ఉన్నామని చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వల్లే ఈ గేమ్ జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బలపరీక్షకు సిద్ధంగా ఉందన్నారు. అయితే తాము ఎంవీఏతోనే ఉన్నామని అలాగే ఉంటామని అన్నారు. 'వారు (శివసేన) ఎవరితోనైనా పొత్తు పెట్టుకోవాలనుకుంటే మాకు ఇబ్బంది లేదు' అని వ్యాఖ్యానించారు.

మరోవైపు శివసేనలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ గురువారం కీలక సమావేశానికి పిలుపునిచ్చింది. ముంబైలోని సహ్యాద్రి అతిథి గృహంలో జరిగే ఈ మీటింగ్‌కు కాంగ్రెస్ సీనియర్ నేతలు హెచ్‌కే పాటిల్, బాలాసాహెబ్, నానా పటోలే, అశోక్ చవాన్ తదితరులు హాజరుకానున్నారు. అయితే సీఎం ఉద్ధవ్ ఠాక్రేకు చివరి వరకు మద్దతుగా ఉంటామని సంకీర్ణ ప్రభుత్వంలో భాగమైన కాంగ్రెస్, ఎన్సీపీ స్పష్టం చేశాయి.

తీరొక్క పంటలతో అధిక లాభాలు గడించాలి : మంత్రి జగదీశ్ రెడ్డి

సూర్యపేట, జూన్ 23(నేటినిజం ప్రతినిధి): వరి వంటి సంప్రదాయ పంటలకు బదులుగా వాణిజ్య పంటల సాగుతో రైతులు భారీ లాభాలు పొందాలని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెన్ పహాడ్ మండలం అనంతారం ఎక్స్ రోడ్, మెర్సకుంట తండా, మేఖ్యా తండాలలో పలు శుభకార్యాలకు హాజరైన మంత్రి అక్కడి ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు.

ఈ క్రమంలో ప్రస్తుత వానకాలంలో ఏ పంటలు వేస్తున్నారని రైతులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. వరి పంట వల్ల కలిగే లాభ నష్టాలను..అదే విధంగా వాణిజ్య, కూరగాయల పంటలు సాగు చేస్తే కలిగే ఉపయోగాలను మంత్రి వివరించారు.

ఎప్పుడూ వరి వేసి భూమిని పాడుచేసుకోవద్దని, చివరి దశలో వచ్చే తెగుళ్ల ద్వారా రైతులు తీవ్రంగా నష్టోతున్నారన్నారు. అదే పంట మార్పిడి పద్ధతితో మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు.

రైతులు తమకున్న వ్యవసాయ భూముల లో ఒక్క పంటను మాత్రమే సాగు చేయకుండా, మినుము, పెసర, కంది, వేరుశనగ వంటి పంటలను సాగు చేయడం ద్వారా ఒక పంటలో నష్టం వచ్చినా మరొక పంటలో లాభం పొందవచ్చన్నారు.

మంత్రి వెంట ఎంపీపీ నెమ్మాది భిక్షం, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్, మల్కాపురం సర్పంచ్ రామకృష్ణా రెడ్డి, లోకేష్ నాయక్, చేదెళ్ల సర్పంచ్ పరెడ్డి సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

5 నెలల పాటు ఆ వాహనాలపై నిషేధం

న్యూఢిల్లీ, జూన్ 23: ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. చలికాలంలో గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు భారీ వాహనాలు, ట్రక్కులపై నిషేధం విధించింది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి 2023, ఫిబ్రవరి వరకు ఆ వాహనాలను ఢిల్లీలోకి అనుమతించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొద్ది సంవత్సరాల నుంచి చలికాలంలో ఢిల్లీలో గాలి నాణ్యత పూర్తిగా పడిపోతున్న సంగతి తెలిసిందే.

హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లోని పారిశ్రామిక వాడల నుంచి విడుదలవుతున్న కర్బన ఉద్గారాలు, పంటల చెత్తను కాల్చడం ద్వారా వస్తున్న కాలుష్య కారకాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. ఇక చాలా ట్రక్కులు డీజిల్‌తో నడవడం వల్ల వాయు కాలుష్యం బాగా పెరిగిపోతుందని తెలిపింది. దీంతో వాయు కాలుష్యాన్ని నివారించడానికి భారీ వాహనాలు, ట్రక్కుల నిషేధాన్ని అమలు చేయనుంది.

అజ్ఞానులను విజ్ఞానులుగా మార్చిన మహనీయుడు వీర బ్రహ్మేంద్రస్వామి : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, జూన్ 23:: ప్రజలలో నెలకొన్న మూఢ నమ్మకాలను తొలగించి అజ్ఞానులను విజ్ఞానులుగా మార్చిన మహనీయుడుపోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి అని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ రూరల్ మండలం అవుషాపూర్‌లో విశ్వ బ్రాహ్మణులు నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురువారం జరిగిన స్వామి వారి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు.

ప్రతి ఒక్కరిలో దైవభక్తితో పాటు సామాజిక సేవా లక్షణాలు కలిగి ఉండాలన్నారు.

సామాన్య మానవుడిగా జన్మించిన ఆయన భవిష్యత్‌లో జరిగే పరిణామాలను కాలజ్ఞానం ద్వారా బోధించిన విషయాలు నేటికి నిజమవుతున్నాయన్నారు. స్వామి వారి విగ్రహాన్ని బహుకరించిన దాత ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డిని ఆయన అభినందించారు.

కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఏనుగు కావేరి, ఉప సర్పంచ్ అయిలయ్య యాదవ్, సహకార సంఘం డైరెక్టర్ పోచిరెడ్డి, మండల టీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, నాగరాజు, వెంకట్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మల్లేష్, వెంకటేశ్ గౌడ్, విశ్వ బ్రాహ్మణులు ఆచారి, ఓంకార్ చారి, అంజయ్య, నరసింహ, విష్ణుమా చారి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సకల సౌకర్యాలు

-3వ ఫ్లయిట్ ద్వారా 350 మంది మక్కా కు చేరిక..

-హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్...

రాజన్న సిరిసిల్ల, జూన్ 23 (నేటినిజం ప్రతినిధి):హజ్ యాత్రికుల కు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాల సౌకర్యాలు కల్పించిందని, అందుకు సీఎం కేసీఆర్, బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీల ఆరోగ్యం కోసం అల్లాహ్ ను ప్రార్థించాలని తెలంగాణ హజ్ కమిటీ సభ్యులు..ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హజ్ యాత్రికులను కోరారు. గురువారం హజ్ హౌస్ కాన్ఫరెన్స్ హల్ లో 350 మంది హజ్ యాత్రికులు హైదరాబాద్ నుండి మక్కా నగరానికి 3వ విమానంలో వెళ్లారు. ఇహ్ రామ్ బట్టలు తొడిగిన నుండి హజ్ యాత్ర పుణ్య ఫలాలు మొదలవుతాయని, జాగ్రత్తగా, క్షేమంగా వెళ్లి యాత్ర ముగించుకొని విజయవంతంగా తిరిగి రావాలని కోరారు. యాత్రికులు తమ హజ్ నియమాలను పాటిస్తూ..ప్రతి ఒక్కరి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు.

టాలీవుడ్‌లో ముగిసిన సమ్మె.. నేటి నుంచి షూటింగులకు హాజరుకానున్న కార్మికులు..

హైదరాబాద్, జూన్ 23:ఎట్టకేలకు టాలీవుడ్ లో సినీ కార్మికులు చేపట్టిన సమ్మెను విరమించారు. వేతనాల పెంపుపై నిర్మాతల మండలి నుంచి స్పష్టమైన హామీ రావడంతో సమ్మెను విరమిస్తున్నట్టు ప్రకటించారు. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చొరవతో నిర్మాతల మండలితో కార్మిక సంఘాల నేతలు చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా దిల్ రాజు అధ్యక్షతన సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు నిర్మాతల మండలి ప్రకటించింది. రేపు సమన్వయ కమిటీతో చర్చించి వేతనాలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. దీంతో, సమ్మెను విరమిస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ నేతలు ప్రకటించారు. రేపటి నుంచి కార్మికులంతా యథావిధిగా షూటింగుల్లో పాల్గొంటారని తెలిపారు.

పులి వేటలో మరో ఆవు మృతి.. కాకినాడ జిల్లాలో కలవరం

అమరావతి, జూన్ 23 కాకినాడ జిల్లాలో పులి సంచారం కలకలం సృష్టిస్తుంది. గత నెల రోజులుగా పులి సంచారం గ్రామస్థులకు, అటవి సిబ్బందికి కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. నిన్న జిల్లాలోని రౌతులపూడి మండలంలో పులి సంచారించినట్లు గ్రామస్తులు వెల్లడించడంతో అటవి అధికారులు, సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. మేతకు వెళ్లిన ఆవుపై పులిదాడి చేయగా మరో ఆవు ఆచూకి కనిపించడం లేదని గ్రామస్థులు వాపోయారు.

అటవీ అధికారుల బృందం ఎస్.పైడిపాల, పెనుగొండ పరిసర ప్రాంతాల్లో పులి జాడ ఆనవాళ్ల కోసం అన్వేషిస్తున్నారు. బిళ్లలొద్ది, తోటమానిలొద్దిలో పులి అడుగు జాడలను సిబ్బంది పరిశీలిస్తున్నారు. అడవి మీదుగా అనకాపల్లి జిల్లా సరుగుడు, నర్సీపట్నం వైపు పులి వెళ్లే అవకాశం ఉందని అటవి సిబ్బంది భావిస్తున్నారు. పులిని పట్టుకునేందుకు ప్రత్తిపాడుతో పాటు పరిసర గ్రామాల్లో బోన్లు ఏర్పాటుచేసినా అక్కడి నుంచి పులి తప్పించుకుంటుంది.

పోలీస్ శాఖలోని వివిధ విభాగాలకు ఒక రోజు శిక్షణ

రాజన్న సిరిసిల్ల, జూన్ 23 (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ చంద్రయ్య ట్రాఫిక్, రిసెప్షన్ బ్లూ కోల్ట్, పెట్రో కార్, వర్టికల్ అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ట్రాఫిక్ వర్టికల్‌గురించి మాట్లాడుతూట్రాఫిక్ డ్యూటీ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక ప్రణాళిక ఏర్పర్చుకోవడం, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటుగా, రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని అన్నారు. మైనర్ల డ్రైవింగ్, హెల్మెట్ , డ్రంక్ అండ్ డ్రైవింగ్, అతివేగం డ్రైవింగ్ లపై ఆకస్మిత తనిఖీలు చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో లేసర్ గన్ వినియోగించుకొని అతి వేగంగా వెళ్లే వాహనాలకు కళ్లెం వేయాలని అన్నారు. ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించి, ఈ చాలన్ పెండింగ్ ఉన్న వాహనదారులతో ఫైన్ కు కట్టివ్వాలని అన్నారు. ఐదు కన్నా ఎక్కువ చాలాన్ ఉన్న వాహానాలను సీజ్ చేయలని అన్నారు.రిసెప్షన్ వర్టికల్ అధికారులతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వివిధ రకాల అభ్యర్థనలు, ఫిర్యాదులు, సమాచారం, సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి తగు సేవలు అందించడంలో రిసెప్షన్ అధికారి యొక్క పాత్ర కీలకమైనదన్నారు. ప్రజలందరికీ పోలీస్ వ్యవస్థపై నమ్మకం విశ్వాసం కల్పించడంలో రిసెప్షన్ అధికారి ముఖ్య పాత్ర వహిస్తారని, ప్రతి రిసెప్షన్ అధికారి బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా స్నేహపూర్వకంగా ప్రవర్తిస్తూ పోలీస్ పై మరింత నమ్మకం కలిగేలా ప్రవర్తించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. బ్లూ కోల్ట్ పెట్రో కార్ వర్టికల్ అధికారులతో మాట్లాడుతూ బ్లూ కోల్ట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. డయల్ 100 కు కాల్ చేయగానే పోలీసులు వచ్చి సమస్య పరిష్కరిస్తారని, ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. హాట్ స్పాట్స్ నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటిపై నిఘా ఉంచాలన్నారు. సస్పెక్ట్, రౌడీ, కేడీ, డిసిలను తరచుగా చెక్ చేయాలని సూచించారు. విధిగా పాయింట్స్ బుక్స్ తరచుగా చెక్ చేయాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనేస్పందించిసాధ్యమైనంత త్వరగా ఈ సంఘటన స్థలానికి చేరుకోవాలని సూచించారు. డయల్ 100 కాల్ ట్యాబ్ లో నిక్షిప్తం అయినందున సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేసి సమస్య పరిష్కరించిలని సూచించారు ఏదైనా సమస్య ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకవెళ్ళాలి అని అన్నారు. బ్లూ కోల్ట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది ప్రోయాక్టివ్ పోలీసింగ్ బాగా చేయాలని దానిద్వారా ముందు జరుగు నేరాలను అరికట్టే వచ్చని సూచించారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించే టప్పుడు కొత్తవారిని తనిఖీ చేసి అసాంఘిక శక్తుల కదలికలు గుర్తించి తదుపరి హాట్ స్పాట్స్ వద్దకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో వర్టికల్ ఇంచార్జ్ సిఐలు బన్సీలాల్, నవీన్ కుమార్, వెంకటేష్ ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ టెక్నాలజీ డిప్లమో కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి, జూన్ 23(నేటి నిజం ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ లోని వెంకటగిరిలో గల శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ నందు మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లమో కోర్సులు ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు మొత్తం 77 సీట్లు కేటాయించినట్లు తెలిపారు.

శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ నందు 53 సీట్లు, తమిళనాడులోని సేలం లో 11 సీట్లు, కర్ణాటకలోని గడగ్ నందు 4 సీట్లు కేటాయించారని, ఒరిస్సా లోని బర్గర్ లో 9 సీట్లను తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులకు మాత్రమే కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు.

అభ్యర్థులు పదవ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు..తేదీ.1.7.2022 నాటికి బిసి మరియు జనరల్ కేటగిరీ అభ్యర్థులు 15 నుండి 23 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగల వారికి వయోపరిమితి 25 సంవత్సరాల వరకు అనుమతిస్తారని పేర్కొన్నారు.దరఖాస్తులను జూలై 15 లోపు సమర్పించాలని సూచించారు.

దరఖాస్తుకు, మరిన్ని వివరాల కొరకు www.iihtvgr.com వెబ్ సైట్ చూడవచ్చని, 9399936872/9010243054 లలో సంప్రదించవచ్చని తెలిపారు.

సీఎం కేసీఆర్‌ది జనరంజక పాలన : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, జూన్ 23: ముఖ్యమంత్రి కేసీఆర్‌ది దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, జగ్గంగూడ, కొల్తూర్, పోతారం, ఉద్దెమర్రి, కేశ్వాపూర్ గ్రామాల్లో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గురువారం భూమి పూజ చేశారు. పోతారం గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.

లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం సీఎం కృషి చేస్తున్నారని తెలిపారు. తండాలు, అనుబంధ గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు నేడు శాశ్వత భవనాల కోసం రూ.25 లక్షలు మంజూరి చేస్తున్నట్లు వివరించారు.

మన ఊరు– మన బడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.7 వేల కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. మొదట విడతలో కొన్ని పాఠశాలల్లో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు ఉన్నత చదువులు చదువుకోవాలని 900ల గురుకుల పాఠశాలలను ప్రారంభించారన్నారు.

కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, జడ్పీటీసీ అనిత, ఎంపీపీలు ఎల్లు బాయి, హారిక, వైస్ ఎంపీపీ సుజాత, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు కుమార్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, హరిమోహన్‌రెడ్డి, జామ్ రవి, ఆంజనేయులు, గోపి నాయక్, రాంచంద్రయ్య, నర్సింహారెడ్డి, శిల్పయాదగిరి, ఎంపీటీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫాక్స్ కాన్ చైర్ మన్ శ్రీ యంగ్ లియుతో ప్రధాన మంత్రి సమావేశమయ్యారు

న్యూఢిల్లీ, జూన్ 23:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఫాక్స్ కాన్ చైర్ మన్ శ్రీ యంగ్ లియూ తో ఈ రోజు న సమావేశమయ్యారు.

"ఫాక్స్ కాన్ చైర్ మన్ శ్రీ యంగ్ లియూ తో భేటీ అయినందుకు సంతోషం గా ఉంది. భారతదేశం లో సెమికండక్టర్స్ సహా, ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించేందుకు వారు వేసుకొన్న ప్రణాళికల ను నేను స్వాగతిస్తున్నాను. విద్యుత్తు వాహనాల (ఇవి స్) తయారీ కి ప్రోత్సాహాన్ని అందించాలన్న మా విధానం ఉద్ధారాల ను నికరంగా సున్నా స్థాయి కి తీసుకు పోవాలన్న మా యొక్క వచన బద్ధత కు అనుగుణం గా ఉంది." అని పేర్కొన్నారు.

వచ్చే నెల 6 నుంచి విశాఖలో మినీ ఐపీఎల్

విశాఖపట్నం, జూన్ 23 వచ్చే నెల 6 వ తేదీ నుంచి మినీ ఐపీఎల్ కు సర్వం సిద్ధమైంది. మినీ ఐపీఎల్‌గా భావించే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ కోసం క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఆటగాళ్ల వేలం రేపటి నుంచి మొదలవుతుంది. గురువారం జరిగిన ఒక సమావేశంలో ఫ్రాంచైజీ లోగోలను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆవిష్కరించింది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ప్రారంభ ఎడిషన్ జూలై 6 నుంచి 17 వరకు కొనసాగనున్నది.

ఏపీఎల్ మొదటి ఎడిషన్ కోసం ఆరు ఫ్రాంచైజీలు ఎంపికయ్యాయి. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ప్రకారం, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కు 27 ఫ్రాంచైజీ ఎంట్రీలు వచ్చాయి. తొమ్మిదింటిని షార్ట్‌లిస్ట్ చేయగా.. ఆరు ఫ్రాంచైజీలు బిడ్‌ను గెలుచుకున్నాయి. ప్రతి జట్టులో 20 మంది ఆటగాళ్లు, నలుగురు సహాయక సిబ్బంది ఉంటారు. ఏపీఎల్ అధికారిక స్పాన్సర్‌గా శ్రీరామ్ గ్రూప్ వ్యవహరిస్తున్నది. జూన్ 24న జరిగే వేలంలో డజన్ల కొద్దీ ఆటగాళ్లు బరిలోకి దిగుతారని, ఆరు జట్లలో ఒక్కో జట్టు 20 మంది ఆటగాళ్లను ఎంపిక చేసుకోవచ్చని ఏసీఏ సీఈవో శివారెడ్డి తెలిపారు. జూలై 17న జరిగే టైటిల్ మ్యాచ్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీక్షించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏపీఎల్ లో పాల్గొనే జట్లు:

1. ఉత్తర ఆంధ్ర లయన్స్
2. రాయలసీమ రాజులు
3. గోదావరి టైటాన్స్
4. కోస్టల్ రైడర్స్
5. బెజవాడ టైగర్స్
6. వైజాగ్ వారియర్స్

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) ట్వంటీ 20 టోర్నమెంట్ నిర్వహణకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఏసీఏకు అనుమతి ఇచ్చింది. గతంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ టీ 20 టోర్నమెంట్ తరహాలో ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను నిర్వహించడానికి తమిళనాడు, కర్ణాటక, సౌరాష్ట్రలకు ఇండియన్ క్రికెట్ బోర్డు అనుమతించిన విషయం తెలిసిందే.

రాజన్న సేవలో టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా

రాజన్న సిరిసిల్ల, జూన్ 23 (నేటినిజం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని గురువారం తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా

దర్శించుకొని, ప్రత్యేక పూజల చేశారు. అనంతరం టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దంపతులకు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు.

వారి వెంట ప్రోటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, వైశ్య సంఘ నాయకులు కృపాల్, కటుకురి శ్రీనివాస్ ఉన్నారు.

లోయలో పడ్డ బస్సు.. ఐదుగురు మృతి.. 40 మందికి గాయాలు

ఇండోర్, జూన్ 23మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇండోర్ ? ఖాండ్వా మార్గంలో బస్సు 50 అడుగుల లోతున్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా.. 40 మంది గాయపడ్డారు. ప్రమాద సమయంలో 50 మందికిపైగా ప్రయాణికులున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో నుంచి క్షతగాత్రులను రక్షించి, ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బస్సు ఇండోర్ నుంచి ఖాండ్వా వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నది. సిమ్రోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భైరవ్ ఘాట్‌పై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు లోయలో పడిపోయిందని సమాచారం

రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి నిచ్చే పంటలను ప్రోత్సహించాలి-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, జూన్ 23 (నేటి నిజం ప్రతినిధి) రైతుల కష్టం వృధా కాకుండా కాపాడాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పేర్కొన్నారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అధికారులతో వానాకాలం పంటల సాగు విస్తీర్ణం, పంటల ప్రణాళిక, విత్తనాలు ,ఎరువుల అందుబాటు, రైతు బంధు, రైతు బీమా తదితర అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏవో లు ,ఏ ఈ ఓ లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, రైతులకు తక్కువ పెట్టుబడి తో ఎక్కువ దిగుబడిని ఇచ్చే పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ఆయా భూములలో పండే పంటలను సూచించాలన్నారు. ప్రభుత్వం ఏ ఆశయంతో ఏఈవోల నియామకం చేసిందో ఆ ఉద్దేశాన్ని నెరవేర్చవలసిన ఆవశ్యకత ఉందన్నారు. రైతులతో మమేకమై వారితో కలిసి పోయి భూమి రకం, పంటలు, ఎరువులు, విత్తనాలు తదితర అంశాలపై అవగాహన కల్పించి రైతులను చైతన్య పరచాలని అన్నారు.

రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని , వానాకాలం ఏ పంటలు వేయాలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. విత్తనాలు ఎరువులు అవసరం మేర అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.కల్తీ విత్తనాలు,కల్తీ పురుగుమందులు రైతులకు అమ్మకుండా అరికట్టాలని , విత్తనాల షాపులను తనిఖీ చేయాలని ,సీడ్స్ శాంపిల్స్ ను ల్యాబ్ కు పంపి నాణ్యత సర్టిఫికెట్ వచ్చేవరకు డీలర్లు విత్తనాలనుఅమ్మ రాదని, నాణ్యత పరిశీలించిన తర్వాతే విత్తనాలు అమ్మేలా చర్యలు చేపట్టాలన్నారు.

రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే షాప్ సీజ్ చేసి, డీలర్ పై 6ఏ కింద కేసు బుక్ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాలు నాణ్యమైన వని సర్టిఫై చేసిన తర్వాత నకిలీ విత్తనాలుగా తేలితే మండల ఏ ఓ ను, ఏ ఈ ఓ ను సస్పెండ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

ఏవోలు తమ తమ మండల పరిధిలో ఉన్న రైతులు, సాగు భూమి, వేసే పంటలు, అందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఏ క్లస్టర్ కు ఏ సీడ్ ఏ క్రాప్ అన్నది ఏఈవోలు ప్రణాళిక చేయాలని సూచించారు. కాటన్ విత్తనాలు బయటి నుండి వచ్చి ఇస్తుంటారని, వారిపై నిఘా పెట్టి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు.జిల్లాలో ఎరువులు ,విత్తనాలకు సంబంధించి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని తెలిపారు.

ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న రైతు బంధు పథకం వంద శాతం రైతులకు అందేలా చూడాలని తెలిపారు. రైతుబంధుకు సంబంధించి ఇంకా అప్డేట్ కానీ రైతుల బ్యాంకు ఖాతాలు ఏవైనా ఉంటే వెంటనే అప్డేట్ చేయాలని సూచించారు. రైతు డా టాను అప్డేట్ చేసి లిస్ట్ డిస్ప్లే చేసి, ఏఈవోలు అండర్ టేకింగ్ ఇవ్వాలని తెలిపారు. రైతుల నుండి ఏదైనా ఫిర్యాదు వస్తే ఏ ఈ ఓ లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ ఈ ఓ క్లస్టర్ వారీగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మరోమారు రైతుబంధు అర్హతగల రైతులను గుర్తించాలన్నారు. ఎక్కడ అలసత్వం ఉండరాదన్నారు.రైతు భీమా పథకంలో వివిధ కారణాలతో బీమా అందని రైతు కుటుంబాలకు భీమా డబ్బులు అందేలా ఏవో, ఏఈ వో లు రెండు మూడు రోజుల లోగా అన్ని రకాల ప్రాసెస్ పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు వేదికలలో రైతులకు వారంలో రెండు శిక్షణలు విధిగా జరగాలని ఏఈవో లకు సూచించారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ జె.డి నరసింహారావు, ఏ డి ఏ లు, ఏవో లు, ఏ ఈ ఓ లు పాల్గొన్నారు.

కరెంట్ వైర్ల కింద ఉన్న హరితహారం మొక్కలను ప్రక్కకు నాటాలి

-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కదారి రాములు

రాజన్న సిరిసిల్ల, జూన్ 23 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోనికరెంట్ వైర్ల కింద ఉన్న హరితహారం మొక్కలను ప్రక్కకు నాటాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కదారి రాములు అన్నారు.

గురువారం కరెంట్ స్తంభాలు కింద, వైర్ల కింద నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు చిన్నవిగా ఉన్నప్పుడే పక్కకు పెట్టాలని, మొక్కలు పెరిగి కరెంటు వైర్లను తాకితే వర్షాల సమయంలో తరచూ కరెంటు పోయే పరిస్థితి ఉంటుందన్నారు. మొక్కలు చిన్నవిగా ఉన్నప్పుడే ఇతర చోటుకి మారిస్తే వేగంగా పెరుగుతాయన్నారు. అందువల్ల వర్షాకాలంలో ఆ చెట్లను వైర్ల కింద కెళ్ళి తీసి పక్కకు పెట్టాలని మున్సిపాలిటీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి ఎల్ల రాజు, రవేష్, దేవేందర్, రాజు, దుర్గయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో పైకి రావాలి

-టీఆరెస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి

-దత్తు మెన్స్ ఫ్యాషన్ వేర్ ను ప్రారంభించిన ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, జూన్ 23 (నేటినిజం ప్రతినిధి): యువత స్వయం ఉపాధితో పైకి రావాలనిటీఆరెస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలో సెస్ కార్యాలయం సమీపంలో నెలకొల్పిన దత్తు మెన్స్ ఫ్యాషన్ వేర్ ను ఏనుగు మనోహర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో సాధించడానికి అనేక వ్యాపార రంగాలు ఉన్నాయని, యువత ఏదైనా ఒక రంగాన్ని ఎంచుకొని ముందుకుసాగాలన్నారు. వ్యాపార రంగంలో కష్టపడితే అదే ఉన్నత స్థాయికి తీసుకెళుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుడూరి మధు, నిమ్మశెట్టి విజయ్, బిజెపి నాయకులు సన్నిధి వెంకట కృష్ణలు ఉన్నారు.

ఉత్తర్ ప్రదేశ్ లోని పీలీభీత్ లో జరిగిన రోడ్డు దుర్ఘటన లో ప్రాణ నష్టం వాటిల్లినందుకు సంతాపం తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 23:పీలీభీత్ లో జరిగిన ఒక రోడ్డు దుర్ఘటన లో ప్రాణనష్టం సంభవించినందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన లో గాయపడ్డ వ్యక్తులు శీఘ్రంగా కోలుకోవాలని కూడా ఆయన ఆకాంక్షించారు. "ఉత్తర్ ప్రదేశ్ లోని పీలీభీత్ లో జరిగిన రహదారి ప్రమాదం హృదయ విదారకం గా ఉంది. ఈ దుర్ఘటన లో ప్రియతములను కోల్పోయిన వ్యక్తుల కు నేను నా శోకాన్ని, సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. దీనితో పాటుగా క్షతగాత్రులందరు త్వరిత గతి న స్వస్థులు కావాలని కూడా ఆకాంక్షిస్తున్నాను: ప్రధాన మంత్రి ఏనిజీతీవనిటతీజీవనీటతి " అని పేర్కొంది.

బార్బెక్యూ నేషన్ 'మ్యాంగో మేనియా ఫుడ్ ఫెస్టివల్' ప్రారంభం

హైదరాబాద్, జూన్ 23: ఈ వేసవిలో పండ్ల రారాజును పురస్కరించుకుని బార్బెక్యూ నేషన్ తన ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మ్యాంగో మానియా ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభించినట్లు బార్బెక్యూ నేషన్ హాస్పిటాలిటీ లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నకుల్ గుప్తా తెలిపారు. పండుగ కాలంలో జూన్ 13 నుంచి జూన్ 30 వరకు బార్బెక్యూ నేషన్ దేశవ్యాప్తంగా ఉన్న తన రెస్టారెంట్లకు అతిథులను ఆహ్వానిస్తోందన్నారు. మామిడిపండ్ల నుంచి ప్రేరణ పొందిన రుచికరమైన వంటకాల విస్తృత వ్యాప్తితో, పానీయాలు స్టార్టర్ల నుంచి ప్రధాన కోర్సు, డెజర్ట్ ల ఇవన్నీ మామిడి పండ్ల మంత్రముగ్ధులను చేసే ట్విస్ట్ తో ఉంటాయన్నారు. తిరుపతి, నెల్లూరులోని బార్బెక్యూ నేషన్ రెస్టారెంట్లలో ఈ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతోందన్నారు. బార్బెక్యూ నేషన్ వద్ద ఈట్–ఆల్–యు–కెన్ బఫెట్ శాఖాహారం, మాంసాహార స్ప్రెడ్లలో 13 వంటకాలను అందిస్తుందన్నారు. తరువాత వచ్చే ఉత్తేజకరమైన ఆహారానికి స్వరాన్ని సెట్ చేయడానికి అతిథులు ప్రసిద్ధ భారతీయ సాంప్రదాయ వేసవి శీతల పానీయం ఆమ్ పన్నాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. స్టార్టర్స్ కోసం, మాంసాహారులు కచ్చి అంబి ఫిష్ టిక్కా మరెన్నో రుచి చూడవచ్చన్నారు. శాకాహారులు నోటిలో నీరు త్రాగే మిరప మామిడి పైనాపిల్ పై విందు చేయవచ్చన్నారు. మాంసాహారులకు ప్రధాన కోర్సు విభాగంలో అంబి ఫిష్ కర్రీ ఉంటుందన్నారు. శాకాహారులు అంబి దాల్ తడ్కా, అంబి వెజ్ మరెన్నో తినవచ్చన్నారు. డెజర్ట్ విభాగంలో మ్యాంగో పేస్ట్రీ, మ్యాంగో మౌస్సే, ఆమ్ ఫిర్ని ఉన్నాయని తెలిపారు. చెఫ్ మామిడి పండ్ల వివిధ రుచులను ఒకదానిలో మిళితం చేసి, చాలా ఇష్టపడే డెజర్ట వైవిధ్యమైన కలయికలను సృష్టించారని పేర్కొన్నారు. అతిథులు వేసవిలో మా రెస్టారెంట్లను సందర్శించడానికి కొత్త కారణాల కోసం ఎదురు చూస్తారన్నారు. మామిడి ఆధారిత వంటకాల విస్తారమైన వ్యాప్తితో, ఈ వేసవిలో వేడిని అధిగమించడానికి మా సమర్పణలలో కొన్ని రిఫ్రెషింగ్ రుచులను నింపడానికి ఈ పండుగను ప్రారంభించడం మాకు సంతోషంగా ఉందన్నారు. అతిథుల మధ్య ఐక్యత భావనను ప్రేరేపించడానికి వారి కుటుంబాలతో మామిడి పండ్లను కలిగి ఉన్న చిన్ననాటి జ్ఞాపకాలను తిరిగి తీసుకురావడానికి ఎదురు చూస్తున్నామని తెలిపారు. అతిథులు పండుగను ఆస్వాదిస్తారని వారి ప్రియమైన వారితో పాటు వారి ప్రత్యేక సందర్భాలను మాతో జరుపుకుంటారని మాకు చాలా నమ్మకం ఉందన్నారు.

అంతర్జాతీయ ఎమ్ఎస్ఎమ్ఇ దినోత్సవం సందర్భంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 23:జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్థ (ni-msme) హైదరాబాద్ లోని యూసఫ్ గూడ ఎమ్ఎస్ఎమ్ఇ ప్రాంతీయ కార్యాలయంలో ఈ నెల 27న అంతర్జాతీయ ఎమ్ఎస్ఎమ్ఇ దినోత్సవం సందర్భంగా ఔత్సాహిక, సూక్ష్మ, చిన్న తరహా పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహిస్తుంది.

ఈ కార్యక్రమము లో.. బ్యాంకు రుణాల కోసం ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ; రుణాలు మంజూరు కావడానికి కావలసిన పత్రాలు, విధివిధానాలు; ప్రభుత్వ రుణ పథాకాల వంటి పలు అంశాలపై ఔత్సాహిక యువతకు అవగాహన కల్పిస్తారు.

ఆసక్తిగల యువతి యువకులు జూన్ 27 తేదీ ఉదయం 10 గంటలకు ఎన్ఐ–ఎమ్ఎస్ఎమ్ఇ యూసఫ్ గూడ ప్రాంగణానికి వచ్చి నమోదు చేసుకోవలసి ఉంటుంది.మరిన్ని వివరాలకు ఎన్ఐ–ఎమ్ఎస్ఎమ్ఇ ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్రీ జి. సుదర్శన్ 9494959108 లేదా 040–23633228 లను సంప్రదించగలరు.

రిజిస్ట్రేషన్ లింక్ : https://forms.gle/FFkitkXi4N8Skd6V8

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com